ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

శనివారం, 9 ఆగస్టు 2025



కొండరెడ్ల గ్రామం (ఫైల్)

నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

ఇంకెన్నాళ్లు?

- నేటికీ అస్తిత్వం కోసం ఆదివాసీల పోరాటం
- ఇంకా దరి చేరని అభివృద్ధి ప్రణాళికలు
- వెంటాడుతున్న విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి వెతలు
- స్వదేశీ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు.. ఈ ఏడాది ఎజెండా

తరాలు మారుతున్నా.. అడవి తల్లినే నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీల తల రాతలు మాత్రం మారడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి 78వసంతాలు పూర్తవుతునా ఇంకా వారు తమ అస్తిత్వం కోసమే పోరాటం చేస్తున్నారంటే వారి జీవన చిత్రం ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతోంది. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) అలంకార ప్రాయంగానే మారిందని చెప్పక తప్పదు. విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి వెతలు ఇంకా వారిని ఇంకా వెంటాడుతున్నాయి. గతంలో వివిధ గ్రాంట్ల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీ ఎత్తున నిధులు ఏజెన్సీ అభివృద్ధి కేటాయించేవారు. కానీ తెలంగాణ ఆవిర్భవించిన అనంతరం ఐటీడీఏల ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు లేక నీరసించిన ఐటీడీఏల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తేనే అవి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటాయని ఆదివాసీ సంఘాల నాయకులు సూచిస్తున్నారు.

6

- ఆంధ్రజ్యోతి, భద్రాచలం

నేడు రాఖీ పౌర్ణమి



ఖమ్మంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రక్తబంధానికి రక్ష

- తోబుట్టువులకు రాఖీ కట్టేందుకు సిద్ధమైన సోదరీమణులు
- రాఖీల కొనుగోళ్లతో దుకాణాలు కళకళ

7



రాక్రేను కలిసిన మంత్రి తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల మాజీ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తుమ్మల రాష్ట్రంలో, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఠాక్రేకు వివరించగా.. పలు అంశాలపై వారిద్దరి మధ్య చర్చ జరిగింది.

రామాలయంలో.. మళ్లీ సంస్కృత బోధన

- దేవస్థానం ఈవో ఆదేశాలతో మార్గం సుగమం

భద్రాచలం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో సంస్కృత బోధన మళ్లీ అందుబాటులోకి రానుంది. కొన్ని దశాబ్దాలుగా దేవస్థానం సంస్కృత పండితులుగా ఉన్న ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఉచితంగా సంస్కృత పాఠాలు బోధించేందుకు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో దేవస్థానం చిత్రకూట మండప ప్రాంగణంలో ఈ పాఠాలను బోధించేందుకు మార్గం సుగమమైంది. గతంలో మాదిరిగా అనుకూలించింత వరకు సంస్కృత విద్యను ఉచితంగా అందించాలని ఈవో రమాదేవి ఈ సందర్భంగా శ్రీమన్నారాయణాచార్యులును కోరారు. ఇదిలా ఉండగా సంస్కృత పండితులు శ్రీమన్నారాయణాచార్యులు గత ఐదు దశాబ్దాల్లో వేలాది మంది విద్యార్థులకు సంస్కృతం బోధించారు. ముఖ్యంగా దేవస్థానంలో కీలక బాధ్యతలు నిర్వహించే వారికి కూడా ఆయన పాఠాలు చెప్పారు.

ఒకప్పుడు ప్రపంచానికి గ్రానైట్‌ను పరిచయం చేసిన ఖమ్మం జిల్లాలోని పరిశ్రమలు ప్రస్తుతం అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత పరిస్థితులు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో విస్తరించి ఉన్న పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకంగా తయారైంది. పదేళ్లుగా ప్రభుత్వం పట్టించుకోకపోవటం స్లాబ్ విధానంపై సబ్సిడీలు ఎత్తివేయటం, క్వారీల నిర్వహణపై ఆంక్షలు పెట్టటం లాంటి పలు అంశాలు గ్రానైట్ పరిశ్రమల నిర్వహణకు గుదిబండలా మారాయి. గ్రానైట్ పరిశ్రమలకు పూర్వ వైభవం రావాలంటే ప్రభుత్వాలు గ్రానైట్ క్వారీలపై పెట్టిన ఆంక్షలను ఎత్తివేసి రా మెటీరియల్‌ను సులభతరం చేస్తే తప్ప పరిశ్రమ మనుగడ కుదుటపడదు. ఈ క్రమంలోనే కొత్తగా మినరల్ డీలర్ లైసెన్స్ (ఎండీఎల్) పద్ధతిని తీసుకొచ్చారు. ఇది కేవలం గ్రానైట్ క్వారీలు, పెద్ద పెద్ద పరిశ్రమలు ఉన్న ప్రాంతాలకు వర్తిస్తుందని తెలిసినా ఈ జీవోను ఖమ్మం జిల్లాకు తీసుకొచ్చారు. దీంతో ప్రశాంతంగా నడుస్తున్న పరిశ్రమకు భారీ దెబ్బగా మారనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఈసీ సర్టిఫికెట్ లేక మూతపడిన గ్రానైట్ క్వారీ

గ్రానైట్‌కు ఎండీఎల్ దెబ్బ!

- కొత్త జీవోలతో కష్టాల్లోకి పరిశ్రమలు
- క్వారీ, ఫ్యాక్టరీల యజమానుల మధ్య ఓటీపీ అమలయ్యేనా?
- 'స్లాబ్'కు కొంత ఉపయోగపడినా.. 'టైల్స్'కు అవస్థలే..
- ఎన్విరాన్‌మెంట్ సర్టిఫికెట్‌తోనూ కష్టాలే
- ఆంక్షలు తొలిగిస్తేనే పరిశ్రమ మనుగడ సాధ్యం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినప్పుడల్లా పలు పరిశ్రమలకు కొత్త నిబంధనలు మారుతుంటాయి. అవి కూడా కేవలం ప్రభుత్వానికి ఆర్థిక వనరులు సమకూర్చుకోవడానికే జరుగుతుంటాయి. అందులో భాగంగా ఖమ్మం జిల్లాకు తలమానికంగా ఉన్న ఏకైక పరిశ్రమ గ్రానైట్ పరిశ్రమ. ఈ పరిశ్రమను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా కొత్త కొత్త నిబంధనలు తెచ్చి ఉన్న పరిశ్రమలు మూతపడే విధంగా చర్యలు చేపడుతున్నారు. గతంలో ఉన్న కొన్ని జీవోలను మళ్లీ తిరిగి తీసుకొస్తున్నారు. ఈ జీవోలు ఖమ్మం జిల్లాలోని గ్రానైట్ పరిశ్రలకు, క్వారీలకు వర్తించవని తెలిసినా కొందరు అధికారులు అత్యుత్సాహంతో అన్ని జిల్లాలకు వర్తించేలా ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తగా మినరల్ డీలర్ లైసెన్స్ (ఎండీఎల్) పద్ధతిని తీసుకొచ్చారు. ఇది కేవలం గ్రానైట్ క్వారీలు, పెద్ద పెద్ద గ్రానైట్ పరిశ్రమలు (మల్టీ కట్టర్స్) ఉన్న ప్రాంతాలకు వర్తిస్తుందని తెలిసినా కొందరు అధికారుల వల్ల ఈ జీవోను ఖమ్మం జిల్లాకు తీసుకొచ్చారు. దీంతో ప్రశాంతంగా నడుస్తున్న పరిశ్రమ ఈ జీవోల కారణంగా పరిశ్రమ మూతపడే ఆస్కారాలు ఎక్కువగా ఉన్నాయి. ఓటీపీ పద్ధతి కాకుండా గతంలో ఉన్న విధంగా పర్మిట్లు మంజూరుచేయాలని టైల్స్ పరిశ్రమ యజమానులు కోరుతున్నారు.

ఎండీఎల్ విధానంలో ఇలా..

ఈ మినరల్ డీలర్ లైసెన్స్ తీసుకుంటే ప్రతీ పరిశ్రమ, క్వారీ యజమానులు వారి వద్ద ఉన్న స్టాక్‌ను ముందుగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. ఆ తరువాత ఓ పరిశ్రమ యజమాని అతడికి కావాల్సిన ముడి సరుకును క్వారీ నుంచి కొనుగోలు చేయాలంటే ముందుగా క్వారీలోని ముడి సరుకును పరిశీలించి మార్కింగ్ చేసిన అనంతరం గనులు భూగర్భ శాఖ కార్యాలయంలో అనుమతి (పర్మిట్)కి దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తులను పరిశీలించిన అదికారులు సంబంధిత క్వారీల్లో ముడి సరుకు వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి అనుమతివ్వనున్నారు. ఈ అనుమతికి సంబంధించి ముందుగా క్వారీ యజమానికి ఆన్‌లైన్‌లో ఇచ్చిన మొబైల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని ముడి సరుకు తీసుకెళ్లే పరిశ్రమ యజమానికి పంపితేనే అనుమతి పత్రాలు జారీ అవుతాయి. ఈ పద్ధతిలో ప్రతీ క్వారీ యజమాని క్వారీల్లో ఇంటర్ నెట్ కనెక్షన్ తీసుకోవాలి.. లేదంటే (మిగతా 6వ పేజీలో)



భద్రాచలంలో కుంకుమ పూజలు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

7

ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం కలిగించాలి

- ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులను వేగిరం చేయాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం



ఆస్పత్రి అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఆసరా పింఛన్లు పెంచకపోతే
పోరాటం ఉధృతం చేస్తాం

- పెంపుపై చంద్రబాబును రేవంత్ ఆదర్శంగా తీసుకోవాలి
- పింఛన్‌దారుల మహాగర్జన వచ్చేనెల 3వ తేదీకి వాయిదా
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ
- కూసుమంచి, వైరాలో పర్యటన

వైరా / కూసుమంచి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆసరా పింఛన్లను పెంచుతామంటూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే.. ప్రభుత్వంపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ స్పష్టం చేశారు. పింఛన్ల పెంపు విషయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి.. ఏపీ సీఎం చంద్రబాబును ఆదర్శంగా తీసుకొని.. రాష్ట్రంలో వెంటనే ఆసరా పింఛన్ల పెంపును అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం కూసుమంచి, వైరాల్లో నియోజకవర్గ స్థాయి ఆసరా పింఛన్ల పెంపు పోరాట సన్నాహక సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం, ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇద్దరూ కూడా ఒకప్పుడు టీడీపీలో చంద్రబాబు నేతృత్వంలోనే పనిచేశారని.. కానీ ఆసరా పింఛన్ల పెంపు విషయంలో వారిద్దరూ చంద్రబాబును ఆదర్శంగా తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి 20 నెలలవుతున్నా పింఛన్లు పెంచటంలో రేవంత్‌రెడ్డి, వాటి పెంపుపై ప్రభుత్వాన్ని నిలదీయ



వైరాలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

డంలో ప్రతిపక్ష నేతగా కేసీఆర్ విఫలమయ్యారని దుయ్యబట్టారు. 2024 ఏప్రిల్‌లో ఏపీలో ఎన్నికల సమయంలో చంద్రబాబును కలిసి ఆసరా పింఛన్లు ముఖ్యంగా దివ్యాంగులకు రూ.ఆరువేలు, నూరుశాతం దివ్యాంగులకు రూ.15వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4వేల పింఛన్ల పెంపు గురించి విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే హామీని నెరవేర్చారన్నారు. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ సర్కారు (మిగతా 6వ పేజీలో)

డిజిటల్ బోధనకు..
అడ్డంకులెన్నో!

- సర్కారీ బడుల్లో మిథ్యగానే కంప్యూటర్ విద్య
- అందుబాటులో లేని ఇంటర్నెట్ సేవలు
- సరైన బోధకులు, సరిపడా ఫర్నీచర్ కరువు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టిఫిషిల్ ఇంటలెజెన్సీ (ఏఐ) సహాయంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేయడమే లక్ష్యంగా డిజిటల్, ఇంటర్నెట్ సేవలు ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి, నిధులు మంజూరు చేసింది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం కంప్యూటర్ విద్య బోధనకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. పాఠశాలల్లో కంప్యూటర్ బోధకులు సరిపడా లేక.. అవసరం మేరకు ఫర్నీచర్ సదుపాయం లేకపోవడం వల్ల కొంతమంది ఉపాధ్యాయులు సరైన శ్రద్ధ చూపకపోవడం పాఠశాలల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో కంప్యూటర్ విద్య 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 1,309 పాఠశాలలు ఉండగా వీటిలో 1,024



ఓ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు

ప్రాథమిక, 164 ఉన్నత పాఠశాలలున్నాయి. జిల్లాలో మొదటి సారిగా 2005లో ఐటీడీఏ పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ సముదాయాలకు, ఒక్కో దానికి 20హెచ్‌సీఎల్ కంపెనీ కంప్యూటర్లు, బీఎస్ఎన్ఎల్ నెట్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. తాత్కాలిక ప్రాతిపదికన ఒక విద్యా వలంటీర్‌ను కంప్యూటర్ బోధకులుగా నియమించారు. తర్వాత 3, 4 సంవత్సరాలకే కంప్యూటర్ విద్యకు వివిధ రకాల ఆటంకాలు ఏర్పడి, కొన్ని సంవత్సరాలకే పని చేయకుండా (మిగతా 6వ పేజీలో)

ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా

రాంనారాయణ, నలజాల వెంకటరావు



కె.రాంనారాయణ, నలజాల వెంకటరావును సన్మానిస్తున్న జర్నలిస్టులు

ఖమ్మం చర్చికాంపౌండ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, 'ఆంధ్రజ్యోతి' బ్యూరో ఇన్‌చార్జ్ నలజాల వెంకటరావు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంలోని జడ్పీ మీటింగ్ హాల్‌లో జరిగిన నామినేషన్ల కార్యక్రమంలో వారు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ సందర్భంగా వారిని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాటేటి వేణుగోపాల్, యూనియన్ మాజీ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భూపాల్, ముసునూరు మహేందర్, స్తంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాంనారాయణ, నలజాల వెంకటరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఖమ్మం యూనియన్ నగర అధ్యక్షుడు, చెరుకుపల్లి శ్రీనివాస్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నామా పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన ఇద్దరు నేతలను సభ్యులు శాలువాలతో సత్కరించారు.

లక్ష్మీతాయారు అమ్మవారికి విశేష స్నపనం



కుంకుమార్చనలో పాల్గొన్న ఈవో, మహిళలు

భద్రాచలం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీతాయారమ్మ వారికి అర్చకులు విశేషస్నపనాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని, లక్ష్మీతాయారు అమ్మవారిని మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిత్యకల్యాణ మండప వేదిక వద్దకు తీసుకొచ్చారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం గావించి రామ అష్టోత్తరం, లక్ష్మీ సహస్రనామార్చనలతో పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమ పూజ, ధూపదీప నైవేద్యాలు, ప్రత్యేక నివేదనలు మంగళహారతి గావించారు. చివరగా వేద ఆశీర్వచనం నిర్వహించారు. మహిళా భక్తులు రూ.200 చెల్లించి పూజల్లో పాల్గొన్నారు. వారికి స్వామి వారి ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, ఇతరత్రా పూజా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వినియోగం గావించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో రమాదేవి, పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకుడు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అమరవాది మురళీకృష్ణమాచార్యులు, ముఖ్య అర్చకుడు అమరవాది మధుసూదనాచార్యులు, పెరంబుదూర్ మదన్‌మోహనాచార్యులు, అర్చకులు శేషాచార్యులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు?



- నేటికీ అస్తిత్వం కోసం ఆదివాసీల పోరాటం
- ఇంకా దరి చేరని అభివృద్ధి ప్రణాళికలు
- వెంటాడుతున్న విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి వెతలు
- స్వదేశీ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు. ఈ ఏడాది ఎజెండా

భద్రాచలం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీల సమస్యలు వారి సాధికారత కోసం ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఎజెండాను రూపొందిస్తోంది. ఈ క్రమంలో స్వదేశీ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు. ఆహార భద్రత, సార్వభౌమాధికారానికి ఒక మార్గం అనే అంశాన్ని 2025 నేపథ్యంగా నిర్ణయించింది. దీనిపై ఈ ఏడాది దృష్టి పెడుతోంది. బాహ్యజోక్యం లేకుండా తమ సొంత భూములు, వనరులను పరిపాలించుకునే స్వదేశీ సమాజాల హక్కు సాధనకోసం దశాబ్దాలుగా ఆదివాసీలు గొంతెత్తి నినదిస్తున్నా స్వయం పాలన హక్కు వారికి కలగానే మిగిలింది.

ఇంకా దరి చేరని అభివృద్ధి ప్రణాళికలు

ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కోసం వందల కోట్ల నిధులు ప్రతిపాదిస్తున్నామని బడ్జెట్‌లో పేర్కొనడమే కానీ ఆచరణలో ఆ నిధులు ఆదివాసీలకు దరిచేరడం లేదని ఆదివాసీ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ప్రధానంగా ఆదివాసీలకు కేటాయించిన నిధులను రహదారులకు వెచ్చించి అభివృద్ధి చేస్తామని చెప్పడమే తప్ప మారుమూల ఏజెన్సీలో ఉన్న ఆదివాసీలకు పక్కా ఇళ్లు నేటికీ లేకపోవడం గమనించదగ్గ విషయం.

వెంటాడుతున్న విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి వెతలు

భద్రాద్రి జిల్లాలో విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి వెతలు ఆదివాసీలను వెంటాడుతున్నాయి. ప్రధానంగా భద్రాచలం ఏజెన్సీలో అక్షరాస్యత శాతం మరింతగా మెరుగుపడాల్సిన అవసరం ఉంది. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నామని పేర్కొంటున్నా.. ఆచరణలో ఆమడదూరంలో ఉండటంతో డ్రాపవుట్స్ సంఖ్య పెరుగుతోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వైద్య సేవలు సైతం ఏజెన్సీలో మరింతగా పెరగాల్సిన అవసరం ఉంది. జిల్లాలో 29పీహెచ్‌సీలు ఉండగా వాటిలో చాలా చోట్ల అత్యవసర సమయంలో ఆదివాసీలకు వైద్యసేవలు అందడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోనూ తమకు పూర్తిగా అన్యాయమే జరుగుతోందని ఆదివాసీ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలాంటి మహనీయులేరీ?

ఆదివాసీల తరఫున అనునిత్యం పోరాడిన ప్రముఖులు పలువురు ఉన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు బీడీ శర్మ, ఎస్ఆర్ శంకరన్, హైకోర్టు న్యాయవాది బాలగోపాల్, మానవ హక్కుల పరిరక్షణ నాయకులు బుర్రా రాములు, ప్రొఫెసర్ జనార్దన్‌రావు లాం టి మహనీయులు దశాబ్దాల పాటు ఆదివాసీల తరఫున తమ గళాన్ని వినిపించారు. అయితే ఇటీవల కాలంలో ఆ మహనీయులు గతించడంతో తాము దిక్కులేని వారమయ్యామని ఆదివాసీలు మనోవేదన చెందుతున్నారు. ఇప్పటికీ కొంతమంది అధికారులు ఆదివాసీ జాతి పట్ల సానుభూతితో వ్యవహరిస్తున్నా మరింతగా తమకు అండగా నిలిచేవారు లేరనే ఆవేదన ఆదివాసీలను వెంటాడుతోంది.

ఆదివాసీ దినోత్సవాన్ని సెలవుదినంగా ప్రకటించాలి

ఆదిమ జాతుల ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9న నిర్వహించుకుంటున్న సమయంలో ఆ రోజున అధికారిక సెలవు ప్రకటించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు ఐటీడీఏల పరిధిలో స్థానిక సెల వు ప్రకటిస్తున్నా.. ప్రభుత్వంనుంచి ఆ దిశగా నిర్ణయం లేకపోవడం పట్ల వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ఆర్థిక పురోగతివైపు పూసుకుంట అడుగులు

- మంత్రి తుమ్మల కృషితో పరిష్కారమవుతున్న సమస్యలు



పూసుకుంట రహదారిలో పూర్తయిన బ్రిడ్జి



పూసుకుంటలో పామాయిల్ మొక్కనాటుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (ఫైల్)

దమ్మపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి దూరంగా కొండలు, గుట్టల మధ్య అడవితల్లిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న పూసుకుంట కొండరెడ్లకు కనీసం రహదారి సౌకర్యం లేదు. ఎటు వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో ఆర్థిక పురోగతి వైపు బాటలు పడుతున్నాయి. 2017లో రహదారులు, భవనాలశాఖా మంత్రిగా తుమ్మల హామీ మేరకు పూసుకుంట రహదారి నిర్మాణానికి రూ.25కోట్లు మంజూరు చేశారు. కొంత మేరకు పనులు జరిగినా.. అటవీ శాఖా అనుమతుల జాప్యంతో పని మధ్యలోనే ఆగిపోయింది. ఆ తర్వాత రహదారి పనులు పూర్తి చేయాలని కొండరెడ్లు వినతులు సమర్పించినా పట్టించుకున్నవారే లేరు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల మళ్లీ కలెక్టర్, ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి పూసుకుంట గ్రామాన్ని సందర్శించి వారి అభివృద్ధికి బాటలు వేసేలా ప్రణాళికలు రూపొందించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, పీవో రాహుల్‌కు బాధ్యతలు అప్పగించారు. పూసుకుంటకు ప్రధాన సమస్యగా ఉన్న రహదారి నిర్మాణం కోసం తుమ్మల రూ.5కోట్లు మంజూరు చేయించి మూడు ప్రధాన బ్రిడ్జీల నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. గ్రామంలోని కొండరెడ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పోడు సాగుకు బదులుగా ఆధునిక సేద్యం చేసేందుకు వ్యవసాయ విద్యుత్‌ను ఏర్పాటు చేసి 13వ్యవసాయ బోర్లు వేయించి పామాయిల్ సాగుకు శ్రీకారం చుట్టారు. కొండరెడ్ల రైతులకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఉద్యానవన, ఆయిల్‌ఫెడ్ అధికారులు అవగాహన కల్పించారు. ఇప్పటికే రహదారి నిర్మాణం దాదాపు 80శాతం పూర్తికావొచ్చింది. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు పూర్తయితే గ్రామ రూపరేఖలు మారనున్నాయి.

ఆసరా పింఛన్లు పెంచకపోతే పోరాటం ఉధృతం చేస్తాం

(5వ పేజీ తరువాయి)

మోసగించిందన్నారు. ఇప్పటికైనా దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు పెంచకపోతే రేవంత్‌రెడ్డిని గద్దె దించేందుకు హైదరాబాద్‌లో భారీ స్థాయిలో ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. అయితే తొలుత హైదరాబాద్‌లో ఆగస్టు 13న పింఛన్‌దారుల మహాగర్జనను తలపెట్టామని, సెప్టెంబరు 3తేదీకి వాయిదా వేసినట్లు ఆయన ప్రకటించారు. కూసుమంచి సమావేశంలో పలువురు మహిళలు రాఖీ పండుగను పురస్కరించకుని మంద కృష్ణకు రాఖీలు కట్టారు. వైరా సమావేశంలో వీహెచ్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కారుమంచి వెంకన్న, మండల ఇన్‌చార్జ్ మాగంటి వెంకటేశ్వర్లు, నాయకులు బత్తుల అంజలి, ఎక్కిరాల సుజాత, సంగెపు ఆదినారాయణ, సైదులు, దూరి ఆనందరావు, ఇల్లు వెంకటి, దాసరి కృష్ణవేణి, ఇలారపు ఉమారాణి, తూరుగంటి అంజయ్య, కోటా కోటి, బెల్లంకొండ రలవి, ఐనాల కనకరత్నం పాల్గొన్నారు.



కూసుమంచిలో మంద కృష్ణకు రాఖీ కడుతున్న మహిళలు

12న జాబ్ మేళా

జిల్లా ఉపాధి అధికారి మాధవి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు అపోలో హోమ్ కేర్‌లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆగస్టు 12న ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటీఐ., టేకులపల్లి) ఖమ్మంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అపోలో హోమ్ కేర్‌లో నర్సులు (30) ఖాళీలకు గాను జీడీఏ, ఎంపీహెచ్ డబ్ల్యూ, డీపీహెచ్ఎంఏ, జీఎన్ఎం. అర్హత గల వారు, నర్సింగ్ సూపర్‌వైజర్ (2) ఖాళీలకు గాను జీఎన్ఎం, పీబీసీ, బీఎస్సీ/ఎంఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన వారు, బయో మెడికల్ ఎగ్జిక్యూటివ్ (2) ఖాళీలకు గాను బీటెక్ బయో మెడికల్ అర్హత ఉండి 18 నుంచి 30ఏళ్ల యువతీ,యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపికైన వారికి నెలకు 25 వేల నుంచి 42 వేల వేతనం ఉంటుందన్నారు. మొత్తం 34 ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి కలిగిన వారు విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

మాయమాటలతో గారడీ చేస్తున్న కాంగ్రెస్

- బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ మాయమాటలతో గారడీ చేస్తుందని బీజేపీ జాతీయ నాయకుడు కర్ణాటక, తమిళనాడు కో ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జిల్లాపార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ప్రపంచంలోని అగ్ర ఆర్థికశక్తుల్లో 4వస్థానానికి చేరిందన్నారు. ప్రజల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఇప్పటికీ రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదన్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందక పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే ప్రభుత్వం మాత్రం తమ ఊహల్లో విహరిస్తుందని విమర్శించారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, గంటేల విద్యాసాగర్‌రావు, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నున్నా రవికుమార్, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, సన్నె దయ్‌ప్రతాప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న డెంగ్యూ పంజా

- అల్లీపురం, పాండురంగాపురంలో పెరుగుతున్న కేసులు



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం/ ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో డెంగ్యూ పంజా విసురుతోంది. ముఖ్యంగా ఖమ్మం నగరంలో విలీనమైన డివిజన్లలో వరసగా డెంగ్యూ కేసులు పంజా విసురుతున్నాయి. 10 రోజుల క్రితం ఒక్కటే కేసు నమోదు కాగా, బుధవారం ఒక్కరోజులోనే ఐదు కేసులు నమోదు కావడంతో ఖమ్మం ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురయ్యారు. కాగా ఖమ్మం నగరంలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు పది కేసులు నమోదు అయ్యాయి. ల్యాబ్ పరీక్షల్లో చాలా రక్త పరీక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి ఫలితాలు వెలువడితే కేసుల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా మంచినీటి నిల్వలు తొలగించకపోవడం, సరైన ఫాగింగ్, దోమల ఉండే బురద, నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయకపోవడం, ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టకపోవడంతో కేసుల సంఖ్యను అదుపులోకి ఉంచే పరిస్థితి కనిపించడం లేదని తెలుస్తోంది.

టీఎన్జీవోస్ కాలనీలో జూలై 26తొలి డెంగీ కేసు నమోదు జరిగింది. తర్వాత 57వ డివిజన్ రమణగుట్టలో ఈనెల 1న రెండో కేసు నమోదు జరిగింది. 15వ డివిజన్ శ్రీనివాసనగర్‌లో 2న ఒక డెంగ్యూ కేసు నమోదు జరిగాయి. 4న అల్లిపురం కొత్తగూడెం, 52వ డివిజన్ బాలాజీనగర్‌లో వరసగా కేసులు నమోదు జరిగాయి. 7న 2వ డివిజన్‌లో 1, 15వ డివిజన్‌లో అల్లీపురంలో 3 కేసులు, 25వ డివిజన్ చర్చికాంపౌండ్‌లో ఒక డెంగ్యూ కేసు నమోదు జరిగాయి. గత రెండు రోజుల్లోనే ఏడు కేసులు నమోదు కాగా పాండురంగాపురం, అల్లీపురంలో ఎక్కువ కేసులు నమోదు జరిగాయి. కాగా కేసులు నమోదు జరిగిన ప్రాంతాల్లో మంచుకొండ వైద్యాధికారి బాలకృష్ణ, కేఎంసీ అర్బన్ మలేరియా విభాగం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

డిజిటల్ బోధనకు.. అడ్డంకులెన్నో!

(5వ పేజీ తరువాయి)

పోయాయి. 2012-13లో కంప్యూటర్ విద్య నేర్పించేందుకు ప్రత్యేక ఫ్యాకల్టీ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. 129పాఠశాలల్లో 812కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. కొంతకాలానికే అవి దెబ్బతినడంతో కంప్యూటర్ విద్య అటకెక్కిందింది. 2016- 17లో 60 పాఠశాలలకు మరమ్మతుల కోసం ఒక్కో పాఠశాలకు రూ.2వేలు మంజూరు చేశారు. అవి సరిపోకపోవడంతో కంప్యూటర్లు పడకేశాయి. ఆ తర్వాత కేయాన్స్ ద్వారా విద్యాబోధన జరగాలని ఉన్నత పాఠశాలలకు వాటిని మంజూరు చేశారు. ఏడాదికే కేయాన్ బోధన కుంటుపడింది.

270 పాఠశాలల్లో డిజిటల్ బోధన..

జిల్లాలోని 270 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో డిజిటల్‌బోధన కోసం ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పాఠశాలల్లో మూడు తరగతి గదుల్లో డిజిటల్ బోధన ఏర్పాట్లు చేశారు. వీటిపై ఒక్కో పాఠశాల నుంచి ఒక్క ఉపాధ్యాయుడికి శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత డిజిటల్ బోధనా విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. కానీ పాఠశాలల్లో 75శాతం ఉపాధ్యాయులు సాధారణ బోధన చేస్తుంటే 25శాతం మంది డిజిటల్ బోధన చేస్తున్నారు. సరైన నెట్ సౌకర్యం లేకపోతే బోధన ఎలా చేయాలని ఉపాధ్యాయులు అంటున్నారు.

ఎందుకు కంటుపడింది..?

కంప్యూటర్లు ఉన్న పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధన సక్రమంగా జరగడం లేదనడానికి అనేక కారణాలున్నాయి. కంప్యూటర్లు ఉన్న పాఠశాలల్లో నెట్ సౌకర్యం లేకపోవడం.. డిజిటల్, కంప్యూటర్ సహాయంతో బోధన చేయడానికి కొందరు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు టీచర్లు డిజిటల్ క్లాస్ ఓపెన్ చేసి ఇతర పనులపై దృష్టి పెడుతున్నారు. డిజిటల్ క్లాస్ పూర్తయిన తర్వాత విశ్లేషణ జరగడం లేదు. కొన్ని పాఠశాలల్లో కంప్యూటర్లు స్టోర్ రూమ్స్‌లో భద్రపరిచారు. తమ సెల్‌ఫోన్ ద్వారా డిజిటల్ బోధన చేసే వారుకేవలం 5శాతం మంది మాత్రమే. కంప్యూటర్ విద్యా బోధకులు లేకపోవడం, కంప్యూటర్స్ రూమ్స్‌ను పరిశుభ్రంగా లేకపోవడం.. ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ లేకపోవడం వల్ల జిల్లాలో కంప్యూటర్ విద్యాబోధన కుంటుపడిందని తెలుస్తోంది.

148 పాఠశాలలకు ఇంటర్నెట్ సేవలు?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 148 పాఠశాలలకు ఇంటర్నెట్ సేవలు అందించడం కోసం రాష్ట్ర విద్యాశాఖాధికారులు బీఎస్ఎన్ఎల్ అధికారులతో ఒప్పందం చేసుకున్నారు. కానీ ఇంత వరకు కార్య రూపం దాల్చలేదు.

శిశు మరణాల రేటును తగ్గించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): శిశు మరణాల రేటును జిల్లాలో తగ్గించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మీ సూచించారు. శుక్రవారం ఐడీవోసీలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితో అత్యవసర సమావేశాన్ని నిర్వహించి సలహాలు, తగు సూచనలు చేశారు. మాట్లాడుతూ గర్భధారణను నివారించడానికి జంటలలో కుటుంబ నియంత్రణ, అంతర పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా శిశువుల మరణాలకు ప్రధాన కారకమైన పోషకాహార రక్తహీనతలను ఎదుర్కొనడానికి మెరుగుపడాల్సిన పద్ధతులను కుటుంబ సభ్యులకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ వీరబాబు, డాక్టర్ సాగరిక, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్లు తేజశ్రీ, డాక్టర్ పుల్లారెడ్డి, ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్లు నాగభూషణం, తదితరులున్నారు.

గ్రానైట్‌కు..

ఎండీఎల్ దెబ్బ!

(5వ పేజీ తరువాయి)

మొబైల్ ఫోన్ ద్వారా క్వారీలోని ముడి సరుకు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ ఓటీపీల సమస్యల కారణంగా గ్రానైట్ వ్యాపారానికి ఇబ్బందులు తప్పడం లేదని పలువురు యజమానులు వాపోతున్నారు.

టైల్స్ పరిశ్రమల్లో నిర్వహణ ఇలా..

స్లాబ్ పరిశ్రమల యజమానులకు సేన్‌రేజ్ కట్టి టైల్స్ పరిశ్రమల యజమానులు తెచ్చుకున్న బ్లాక్‌లు వేస్టేజీ నుంచి చిన్న చిన్న ముక్కలను పరిశ్రమకు తీసుకొచ్చి వాటితో పరిశ్రమ నడిపిస్తున్నారు. ఆ సమయంలో ఆ ట్రాక్టర్‌కు ఏ క్వారీ యజమాని ఓటీపీ చెబుతాడు, ఎలా పర్మిట్ రాయాలో తెలియని పరిస్థితి. లీజులున్న క్వారీ నుంచి లీజు క్వారీ యజమానిని బతిమలాడి డెట్‌రెంట్ కట్టి పర్మిట్లు తీసుకుందామన్నా ఆ క్వారీలకు ఎన్విరాల్‌మెంట్ సర్టిఫికెట్ (ఈసీ) ఉంటేనే లీజులు అనుమతిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 130 లీజు క్వారీలు ఉండగా అందులో ప్రస్తుతం 30 క్వారీలు నడుస్తున్నాయి. వాటికి ఈసీకి దరఖాస్తు చేసిన ఎక్నాలెడ్జెట్‌మెంట్‌తో ప్రస్తుతం లీజు పీరియడ్ వరకు నడవనున్నాయి. జిల్లాలో 12 క్వారీలకు 20సంవత్సరాల అనుమతి ముగియటంతో తిరిగి రెన్యువల్‌కు దరఖాస్తు చేసి ఉన్నారు. కానీ రెన్యువల్ సమయంలో ఈసీ తప్పనిసరి కావడంతో ఆ దరఖాస్తులు ప్రస్తుతం జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి కార్యాలయంలోనే పెండింగ్‌లో ఉన్నాయి. ఈసీ వచ్చేంత వరకు ఈ దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండనున్నాయి. దీంతో ఆ క్వారీలు అనుమతులు వచ్చేంత వరకు మూతపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లాలో ఒకప్పుడు మొత్తం 250 వరకు లీజు క్వారీలు, 550 స్లాబ్ పరిశ్రమలు, 250 టైల్స్ పరిశ్రలతో కళాకళలాడే ఖమ్మం నేడు ప్రభుత్వాల ఆంక్షలతో 30 వరకు క్వారీలు, స్లాబ్ పరిశ్రమలు 300లు, టైల్స్ పరిశ్రమలు 50 వరకు నడుస్తున్నాయి. వాటిలో కూడ మరో 100 పరిశ్రల వరకు మూతపడే ఆస్కారం ఉంది. జిల్లాలోని పలు మండలాల్లో గ్రానైట్ క్వారీల నిల్వలు అధికంగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వాలు పెట్టే ఆంక్షలకు నడిసే పరిస్థితి లేకుండా పోయింది.

జవహర్ లిఫ్ట్ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బండారు నరసింహారావు

ఎర్రుపాలెం, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): జవహర్ ఎత్తిపోతల పథక శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు కాం గ్రెస్ నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆపార్టీ ఆధ్వర్యంలో శుక్రవా రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధిర మండలంలోని వంగవీడు గ్రామం వద్ద వైరా నదిపై రూ.630.3 కోట్లతో తలపెట్టిన జవహర్ ఎత్తిపోతల పథకానికి మండలం నుంచి రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. దీనిలో భాగంగా మీనవోలు గ్రామం నుంచి వంగవీడు పైలాన్‌వరకు భట్టి సతీమణి అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పథకానికి ఈనెల 10న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి భూమి పూజ చేయనున్నారు. ఈకార్యక్రమంలో మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ బండారు నరసింహారావు, మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణ, కృష్ణారావు, గోవర్ధన్‌రెడ్డి, సాంబశివరావు, శ్రీనివాసరావు, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

నీటిపారుదలశాఖ ఎస్ఈగా మంగళపూడి

- పాలేరు డివిజన్ ఈఈగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లుకు ఉద్యోగోన్నతి



ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదలశాఖ పాలేరు డివిజన్ ఈఈగా పనిచేస్తున్న మంగళపూడి వెంకటేశ్వర్లుకు ఎస్ఈగా పదోన్నతి లభించింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాహుల్‌బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆయన్ను ఖమ్మం ఎస్ఈగా నియమిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటీ సీఈగా పనిచేస్తున్న టీఎస్ఎన్ రవికుమార్‌కు గోదావరి రిజర్వాయర్ మానేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) ఎస్ఈగా పోస్టింగ్ కల్పించారు. ఏవీవీఎస్ నర్సింహారావు ప్రస్తుతం ఎస్ఈ కార్యాలయంలో డిప్యూటీ ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు రామగుండం ఎస్ఈగా పదోన్నతి కల్పించారు. ఇల్లెందులో పనిచేస్తున్న కేఎల్ శ్రీనివాసాచార్యులుకు పెద్దపల్లి జిల్లా ఎస్ఈగా పదోన్నతి కల్పించారు.

మద్యానికి బానిసైన యువకుడి హత్య?

- గొడవ పడుతుండగా తాడుతో కట్టేసిన తల్లిదండ్రులు
- మెడకు బిగుసుకుని మృతి
- మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు

మణుగూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై.. తమను వేధిస్తున్న కుమారుడిని దండించేందుకు తల్లిదండ్రులు తాళ్లతో కట్టేయగా ఆ తాడు మెడకు బిగుసుకుని ఆ యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మణుగూరులో జరిగింది. ఈ ఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో హత్యకేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని చేపల మార్కెట్ ఏరియాలో నివాసముండే కుంజా రవి, పార్వతి దంపతుల కుమారుడు మోహనకృష్ణ (22) చేపల మార్కెట్‌లో కూలీపని చేసుకుంటూ జీవించేవాడు. వివాహితుడైన మోహనకృష్ణ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగి వచ్చి తరచూ ఇంట్లో వారితో గొడవ పడుతూ వారిపై భౌతిక దాడికి కూడా దిగేవాడు. ఈ క్రమంలోనే మద్యం తాగి శుక్రవారం తెల్లారుజామున ఇంటికి వచ్చిన మోహనకృష్ణ తన భార్య పూజిత, తల్లి దండ్రులతో గొడవ పటడమే కాకుండా వారిని బాగా కొట్టాడు. దీంతో విసిగిపోయిన తల్లిదండ్రులు.. కుమారుడిని పట్టుకుని ఓ తాడుతో కాళ్లు, చేతులను కట్టేశారు. కానీ ఆ సమయంలో ప్రమాదవశాత్తు తాడు అతడి మెడకు బిగుసుకోవడంతో మోహనకృష్ణ మృతిచెందాడు. ఈ విషయంపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో మోహనకృష్ణ తల్లిదండ్రులపై పోలీసులు కేసు నమోదు చేశారు.



ఖమ్మం గంటుమల్లన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతాలు

కొత్తగూడెం సాంస్కృతికం / ఖమ్మం ఖానాపురంహవేలీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన శ్రావణమాసాన్ని పురస్కరించుకుని నిర్వహించే వరలక్ష్మీవ్రతాన్ని ఉమ్మడి జిల్లాలోని దేవాలయాలు, ఇళ్లలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. లక్ష్మీదేవి అమ్మవారికి పూలమాలలు, పసిడి ఆభరణాలతో విశేష అలంకరణచేసి పసుపు, కుంకుమలతో వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారికి ప్రీతికరమైన పిండి వంటలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ముత్తైదువులను ఆహ్వానించి వాయినాలను ఇచ్చి పుచ్చుకున్నారు. వరలక్ష్మీవ్రతాన్ని ఆచరిస్తే నిండునూరేళ్ల సౌభాగ్యం, సిరిసంపదలు సిద్ధిస్తాయని మహిళల నమ్మకం.



కొత్తగూడెంలో వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు

రక్తబంధానికి రక్ష

» తోబుట్టువులకు రాఖీ కట్టేందుకు సిద్ధమైన సోదరీమణులు » రాఖీల కొనుగోళ్లతో దుకాణాలు కళకళ

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం సాంస్కృతికం/ఇల్లెందుటౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, అక్కాతమ్ముళ్ల ఆప్యాయతే రక్షాబంధన్. రక్తబంధానికి రూపం రక్ష. ఆత్మీయ బంధానికి ఆధారం రాఖీ. ఆ రెండింటి సమ్మిళితమైన తోబుట్టువులైన తియ్యటి జ్ఞాపకం రక్షాబంధన్. ఇంతటి ప్రత్యేకమైన పండుగను శనివారం జరుపుకోనున్నారు. అన్న, తమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి అక్కలు, చెల్లెళ్లు బస్సులలో, రైళ్లలో వచ్చి తన తన తోబుట్టువులకు(అన్న, తమ్ముడు) రాఖీలు కడుతారు. దీంతో బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్స్ మహిళలతో సందడిగా మారాయి. వరుస పండుగల నేపథ్యంలో బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



ఖమ్మం బస్టాండ్‌లో మహిళలు



కొత్తగూడెంలో....



ఖమ్మంలో రాఖీలను కొనుగోలు చేస్తున్న మహిళలు

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రాఖీల కొనుగోలు కేంద్రాలు కళకళలాడుతున్నాయి. శనివారం పండుగ ఉండటంతో యువతులు, మహిళలు, చిన్నారులు వీటిని కొనుగోలు చేస్తుండటంతో ఆ ప్రాంతాలు సందడిగా మారాయి.

ఒకప్పుడు రాఖీ పండుగ వచ్చిందంటే.. మహిళలు రాఖీ కొని పోస్టు లేదా కొరియర్ ద్వారా తమ సోదరులకు పంపించేందుకు సెంటర్లకు వెళ్లడం, కవర్లు కొనడం వంటివి చేసేవారు. అయినా.. అవి సమయానికి చేరుతాయో.. లేదోననే సందేహం ఉండేది. ఇలాంటి ఇబ్బందులను తీర్చేందుకు కొత్తగా ఆన్‌లైన్ ద్వారా రాఖీలు పంపించే పద్ధతి అందుబాటులోకి వచ్చింది. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. ఒక్క క్లిక్ ద్వారా నిర్ణీత చిరునామాకు రాఖీ చేరిపోతుంది.

ఉమ్మడి జిల్లాకు 3 వేల టన్నుల యూరియా

చింతకాని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యవసాయ అవసరాల నిమిత్తం 3 వేల టన్నుల యూరియా శుక్రవారం పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు చేరిందని డీఏవో ధనసారి పుల్లయ్య తెలిపారు. రేక్ పాయింట్ నుంచి మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లుకు యూరియా పంపిణీను ఆయన పరిశీలించారు. ఖమ్మం జిల్లాకు 1501, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 1400, సీఆర్‌పీ ఖమ్మానికి 100 టన్నులు యూరియాను ప్రభుత్వం కేటాయించిందన్నారు.

రైతుల అవ సరాలకు సరిపడా యూరియా నిల్వ ఉందన్నా రు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో పవన్ కుమార్, ఏవో మానస రైతులు పాల్గొన్నారు.



యూరియా పంపిణీని పరిశీలిసున్న డీఏవో

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగించాలి

» ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
» క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులు వేగిరం చేయాలి
» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలని... వైద్యులు అంకితభావంతో పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లాజనరల్ ఆసుపత్రిలో శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుడా కింద జిల్లా ఆసుపత్రిలో 13 అభివృద్ధి పనులు 25 కోట్ల రూపాయలతో చేపట్టామన్నారు. రూ.23 కోట్ల 75 లక్షలతో చేపట్టిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. తక్కువ ఖర్చుతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడే యంత్రాల కొనుగోలు, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని సూచించారు. వాటికి కావాల్సిన నిధులను మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రిలో రోగులకు ఉపయోగపడే విధంగా మరుగుదొడ్ల మరమ్మతు పనులను పూర్తి చేయాలన్నారు.

- ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో అందుబాటులో ఉన్న యంత్రాలు, వాటి ప్రస్తుత స్థితి గతులపై రిపోర్ట్ తయారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మరమ్మతుకు గురైన యంత్రాలను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సౌకర్యాలపై ప్రభుత్వానికి నివేదిక అందించాలని అన్నారు. ప్రజలలో ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం కలిగించేందుకు ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఆదేశించారు. ఆస్పత్రికి కార్పొరేట్ దీటుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రి అంతర్గతంగా సీసీ రోడ్ల నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని, డీఎంఎఫ్‌టీ ఇతర నిధుల నుంచి మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. ఎం. నరేందర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్. కళావతి బాయి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్. రాజశేఖర్ ఆర్‌ఎంవో డాక్టర్ బి రాంబాబు, వినాయక్ రాథోడ్, వైద్య శాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, వైద్య అధికారులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

ఖమ్మం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని ఆరెంపుల గ్రామానికి చెందిన మెడ ఉప్పలమ్మ ఇంట్లో 2025 ఫిబ్రవరిలో చోరీ జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు చోరీకి పాల్పడి ఆరెంపుల గ్రామానికి చెందిన మోతె శ్రీను, పవర్ తరుణ్ ఇద్దరిపై నిఘా ఉంచారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు వద్ద శుక్రవారం వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వారు ఆరెంపులలోనే కాకుండా పలుచోట్ల దొంగతనాలకు పాల్పడ్డట్లు తేలింది. 2024లో తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఓ వ్యక్తి తన పొలంలో వ్యవసాయ పనులకు వెళ్తుండగా అతని మెడలో ఉన్న రెండు తులాల బంగారు లాకెట్, ఓ బంగారు ఉంగరం, సెల్ ఫోన్ దోచుకున్నారు.

దీంతో పాటు తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో ఓ మహిళ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లోకి చొరబడి రాయితో మహిళ తలపై కొట్టి ఆమె మెడలోంచి ఒక తులం బంగారు గొలుసు, అర తులం బంగారు నల్లపూసల గొలుసును బలవంతంగా లాక్కెళ్లారు. 2025 ఫిబ్రవరిలో ద్విచక్రవాహనంపై ఓ జంట గొల్లగూడెం నుంచి ఆరెంపుల వైపు వెళ్తుండగా వెనుక నుంచి మహిళ మెడలోంచి తులం బంగారు గొలుసు లాక్కెళ్లారు. దీనిపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. అదే విధంగా 2024 ఫిబ్రవరిలో కూసుమంచి మండలంలోని లింగారంతండా వద్ద ఓ మహిళ పొలం నుంచి రోడ్డుపైకి ఒంటరిగా వస్తుంటే మహిళ మెడలోని బంగారు గొలుసును ఎత్తిరించారు. వెంటనేఆ మహిళ ప్రతిఘటించడంతో వారు పారిపోయారు. దీనిపై కూసుమంచి పోలీసు స్టేషన్‌లో కేసునమోదు అయింది. వారి వద్ద నుంచి 3 తులాల బంగారు గొలుసు ఒకటి, తులం బంగారు గొలుసు ఒకటి, అర తులం బంగారపు నల్లపూసల గొలుసు ఒకటి, ఆటో, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణలో పాల్గొని చోరీ కేసును చేధించిన రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముష్క రాజు, ఎస్‌ఐ విశ్వతేజ, సిబ్బందిని ఏసీపీ తిరుపతిరెడ్డి అభినందించారు.

బావిలో పడి రైతు మృతి

» చొప్పకట్లపాలెంలో ఘటన

బోనకల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో శుక్రవారం పొలం పనులకు వెళ్లిన ఓ రైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పర్సగాని బుచ్చయ్య(55) తనకున్న మూడు ఎకరాల భూమిలో పంటలను సాగు చేసి జీవనం సాగిస్తున్నాడు. మగాణి భూమిలో నాటు వేసేందుకు గానూ ముందస్తు పనుల్లో భాగంగా గెట్లు చెక్కేందుకు వెళ్లాడు. పనులు ముగించుకొని వంటిపై మట్టిని శుభ్రం చేసుకునే క్రమంలో అతని పొలంలోనే ఉన్న వ్యవసాయ బావిలోకి దిగాడు. వర్షాలకు నీళ్లు నిండుగా ఉండటంతో ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయాడు. అతడికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. చుట్టు పక్కల రైతులు చూసి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



బుచ్చయ్య(ఫైల్)

గుండెనొప్పితో ఆటో డ్రైవర్...

బోనకల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చామర్తి నాగేశ్వరరావు(55) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. 15 రోజుల క్రితం గుండెనొప్పి రాగా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ చేశారు. ఆ తరువాత అక్కడే ఉన్న కుమార్తె ఇంట్లో ఉండి వైద్య సేవలు పొందుతున్నాడు. ఈ క్రమంలో మరోసారి గుండెనొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనారోగ్యంతో బస్సులో ప్రయాణికుడి మృతి

» మృతుడు ఛత్తీస్‌గఢ్ వాసి



దేవశిషాను పరీక్షిస్తున్న 108 సిబ్బంది

వైరా, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన దేవశిషా అనే ప్రయాణికుడు అనారోగ్యంతో బస్సులోనే మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా గుడారా గ్రామానికి చెందిన దేవశిషా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రి లో చికిత్స అనంతరం తన స్వగ్రామానికి వెళ్లేందుకు ఒంటరిగా భద్రాచలం బస్సులో బయల్దేరాడు. ఈ క్రమంలో బస్సులోనే అతడు మృతిచెందగా బస్సు డ్రైవర్ ఖమ్మం జిల్లా వైరా బస్టాండులో బస్సును నిలిపివేసి స్టేషన్ మేనేజర్‌కు సమాచారమిచ్చాడు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది అతడిని పరీక్షించగా అప్పటికే అతడు మృతిచెందాడని నిర్ధారించారు. వైరా ట్రెయినీ ఎస్‌ఐ వెంపటి పవన్ అక్కడికి చేరుకుని దేవశిషా మృతదేహాన్ని పరిశీలించి.. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఛత్తీస్‌గఢ్‌లోని అతడి కుటుంబీకులకు సమాచారమిచ్చారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

బూర్గంపాడు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బూర్గంపాడులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టారు. భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీమున్నీసాబేగం ఆధ్వర్యంలో తెలంగాణ-ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన కిన్నెరసాని పరివాహక ప్రాంతంలో చేపట్టిన దాడుల్లో 30కు పైగా సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములను గుర్తించారు. అలాగే సారాయి తయారీ సామగ్రిని, 1000లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా, విక్రయించినా సంబంధిత నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ అలీమ్, సిబ్బంది వీరబాబు పాల్గొన్నారు.

భార్యపై భర్త కత్తితో దాడి

ఇల్లెందు టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటన శుక్రవారం ఇల్లెందులో చోటుచేసుకుంది. ఇల్లెందు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని గోవిందుసెంటరులో నివాసం ఉండే గట్టు రామచందర్‌రావు మద్యం సేవించి తన భార్య శారదపై కత్తితో దాడి చేయగా ఆమెకు గాయాలయ్యాయి. శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడి చేసిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

ఏదులాపురంలో వ్యక్తిపై...

ఖమ్మం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసునమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయిగణేష్‌నగర్ కాలనీకి చెందిన గుడిపెల్లి సుదర్శన్ గురువారం రాత్రి సరుకుల కోసం ఆ కాలనీలోని ఓ సూపర్ మార్కెట్‌కు వెళ్లాడు. అంతకు ముందు అక్కడే మెరుగు భాస్కర్, మిడికంటి రాజవర్ధన్ రెడ్డిని ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఈ విషయం తెలిసి భాస్కర్ తరుపున ఘర్షణ గురించి సుదర్శన్ వెళ్లి రాజవర్ధన్‌రెడ్డిని ప్రశ్నించాడు. తనను ప్రశ్నించే సరికి కోపోద్రిక్తుడైన రాజవర్ధన్‌రెడ్డి కత్తితో సుదర్శన్‌పై దాడి చేశాడు. దీంతో అతడు గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై సుదర్శన్ సతీమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

భద్రాచలం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని పట్టణ పోలీసులు ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న సారపాక గ్రామానికి చెందిన గుగులోతు శ్రీను అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నిందితుడి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డిపో మేనేజర్ వేధిస్తున్నాడని ఆందోళన

» సీఐ నాగబాబు సూచన మేరకు విరమించిన సిబ్బంది
» పోలీస్‌స్టేషన్లో నాయకుల ఫిర్యాదు
» మణుగూరు పట్టణంలో ఘటన



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న జేఏసీ నాయకులు

మణుగూరు టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ సిబ్బందిని వేధిస్తున్నాడని శుక్రవారం డిపో ముందు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. డిపో మేనేజర్ సిబ్బందిపై అకారణంగా వేధింపులకు గురిచేస్తూ మాట్లాడుతున్నాడని వాపోయారు. ప్రయాణికుల నుంచి అందిన చిన్నపాటి సమస్యలను కూడా పెద్దగా చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నదే కాక ఉద్యోగాల నుంచి కూడా తొలగిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. విషయం తెలుసుకున్న మణుగూరు సీఐ నాగబాబు అక్కడకు చేరుకుని మీ సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించడంతో సిబ్బంది ఆందోళన విరమించుకున్నారు. సీఐ సూచనల మేరకు జేఏసీ సభ్యులు ఆర్టీసీ మేనేజర్ శ్యాంసుందర్‌ను కలిసి సమస్యను పరిష్కరించుకోవాలని కోరగా.. మేనేజర్ శ్యాంసుందర్ దురుసుగా మాట్లాడటంతో జేఏసీ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ విషయంపై డిపో మేనేజర్ శ్యాంసుందర్‌ను వివరణ కోరగా.. సిబ్బందిని ఎవరినీ వేధింపులకు గురిచేయలేదని తెలిపారు. ప్రయాణికుల ఫిర్యా దు మేరకు విచారణ చేశానన్నారు. గురువారం మణుగూరు నుంచి ఖమ్మం వెళ్తున్న బస్సులో లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఒక ప్రయాణికుడు మణుగూరులో బస్సు ఎక్కగా కండక్టర్ తేజస్వినితో లక్ష్మీపురం వెళ్లాలని చెప్పగా అక్కడ బస్సు స్టేజీ లేదని ప్రయాణికుడితో చెప్పడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా ప్రయాణికుడు నాకు ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో కండక్టర్‌తో అక్కడ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆరు నెలల క్రితమే స్టేజీ ఏర్పాటు చేసినట్లు కండక్టర్‌కు తెలిపినట్లు వివరించాడు. ఈ విషయం జేఏసీ నాయకులతో కూడా చెప్పిన ఆందోళన చేయడం సబబు కాదని డిపో మేనేజర్ పేర్కొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

» 12 మందిపై కేసు నమోదు



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ నాగుల్‌మీరా

చింతకాని, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్యాక్షన్‌ను తలదన్నేలా కత్తులు, కొడవళ్లతో యువకుడి పై 12 మంది దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన గురువారం అర్ధరాత్రి చింతకాని మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...2016-17 సంవత్సరంలో మండల కేంద్రానికి చెందిన 9 దళిత కుటుంబాలకు చింతకాని రెవెన్యూ పరిధిలో 27 ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం దళితులకు భూ పంపిణీ పథకంలో భాగంగా ఒక్కో కుటుంబానికి 3 ఎకరాల చొప్పున పంపిణీ చేసింది. ఈ భూ పంపిణీకి సంబంధించి తమకు భూమిపై హక్కు ఉందని అందుకు తమ దగ్గర ఆధారాలు ఉన్నాయంటూ ఇటీవల 19 మంది దళిత కుటుంబాలకు చెందిన వ్యక్తులు భూమి గెట్లను దున్నడంతో పోలీసులు 19 మందిపై కేసు నమోదు చేశారు. భూమిపై హక్కు ఉందంటూ గత రెండు రోజుల నుంచి కొంత మంది దళితులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేపడుతుండటంతో ఇరు వర్గాల మధ్య వివాదం తారాస్థాయికి చేరింది.

ఈ నేపథ్యంలో భూమి పట్టా ఉన్న నారపోగు వెంకటరావమ్మ కుమారుడు రామకృష్ణ గురువారం రాత్రి చర్చికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఉసికల నాగరాజుతో పాటు మరో 11 మంది వ్యక్తులు రామకృష్ణపై కత్తులు, కొడవళ్లతో దాడికి పాల్పడ్డారు. దీంతో ఆ ప్రాంత మంతా అరుపులు, కేకలతో దద్దరిల్లిపోయింది. స్థానికులు అప్రమత్తం అవడంతో అక్కడి నుంచి దుండగులు పారిపోయారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన రామకృష్ణను స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి ఉసికల నాగరాజుతో పాటు మరో 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు. ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

» ఓ మాజీ సైనికుడిపై కేసు » ఒకరి నుంచి రూ.14లక్షల వసూలు

కల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కల్లూరు మండలంలోని పేరువంచ గ్రామానికి చెందిన ఓ మాజీ సైనికుడు పలు ప్రాంతాలకు చెందిన నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలు చేసి మోసగించిన తీరుపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని పేరువంచ గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పరిమి భరత్ ఇటీవల కాలంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురు నిరుద్యోగులు, వారి కుటుంబాల వారిని నమ్మించాడు. ఈ క్రమంలో కొత్తగూడెం ప్రాంతానికి చెందిన ఓ నిరుద్యోగి నుంచి రూ.14లక్షలు వసూలు చేశాడు. ఎంతకు ఉద్యోగం ఇప్పించకపోవడంతో బాధితులు భరత్‌ను నిలదీయగా.. ఆ తర్వాత అతడు పరారయ్యాడు. ఈ నేపథ్యంలో సదరు బాధితుడి తండ్రి ఇటీవల కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ హరిత భరత్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. అయితే భరత్ మరికొందరు నిరుద్యోగుల వద్ద కూడా నగదు వసూలు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉంటే పలు రాజకీయ పార్టీల్లో క్రియా శీలకంగా వ్యవహరించిన సదరు మాజీ సైనికుడు.. తనకు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయని చెప్పుకొని మోసాలకు పాల్పడినట్లు తెలిసింది.

జిరాక్స్ షాపుల్లో పోలీసుల తనిఖీలు

» ఖాళీ నోటరీలు స్వాధీనం

ఖమ్మంక్రైం ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తమునిసిపాలిటీ కార్యాలయ సమీపంలోని ఓ జిరాక్సు సెంటర్‌లో శుక్రవారం రాత్రి టాస్కుఫోర్స్, ఖమ్మంటుటౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బర్త్, డెత్ సర్టిఫికెట్లు, వంటి వాటి కోసం వచ్చే వారికి లాయరు నోటరీ అవసరం ఉంటుంది. ఈనేపథ్యంలో సదరు జిరాక్సు షాపు నందు ఎటువంటి అనుమతి లేకుండా అడ్వకేట్‌తో ఖాళీ దస్తావేజులపై సంతకాలు పెట్టించి అక్రమంగా నోటరీలు అమ్ముతున్నారని సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఖాళీ దస్తావేజులపై లాయర్ స్టాంప్‌తో సంతకాలు చేసి ఉన్న 36 నోటరీ దస్తావేజులు పట్టుబడినట్టు టుటౌన్ పోలీసులు తెలిపారు. దీంతో సదరు షాపు యజమానితోపాటు సంబంధించిన వారిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

తిరుమలాయపాలెం, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని పాలేరు నియోజకవర్గ స్పెషలాఫీసర్ రమేష్ తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో డెంగీ, మలేరియా, విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని, వీటి నివారణకు వైద్య సిబ్బంది తగు చర్యలు చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలుతున్న గ్రామాలను సందర్శించి వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. అలాగే ఇంటింటి సర్వే చేపట్టి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సిలార్‌సాహెబ్, మెడికల్ సూపరింటెండెంట్ కృపాఉషశ్రీ, వైద్యాధికారి అవినాష్, అమర్‌సింగ్, సూరజ్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎం గోదాము పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా గోడౌన్‌ను తనిఖీ చేసి, గోడౌన్‌రూం సీల్‌ను పరిశీలించారు. గోడౌన్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఆర్అండ్‌బీ. అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా, గోడలలో నీరు ఇంకకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. భద్రతా సిబ్బంది డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని,ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి,కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఏంఏ. రాజు, డీటీ అన్సారీ, ఆర్ అండ్‌బీ ఏఈఈ లలిత ఉన్నారు.

మట్టి గణపతులను పూజించాలి

స్తంభాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లాహోటి



సమావేశంలో మాట్లాడుతున్న లాహోటి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిక్షణలో భాగంగా మట్టివినాయక విగ్రహాలనే పూజించాలని స్తంభాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వినోద్ లాహోటి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని గణేష్ ఉత్సవ కమిటీ కార్యాలయంలో స్తంభాద్రి ఉత్సవ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 27న గణేష్ చతుర్థసి, సెప్టెంబరు 6న గణేష్ నిమజ్జనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండపాల ఎదురుగా కాశాయ ధ్వజం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో గెంటాల. విద్యాసాగర్, వేల్పుల.సుధాకర్, అల్లిక. అంజయ్య, ఈశ్వరప్రగడ.రామారావు, శ్రీహరి, వెంకట్ పాల్గొన్నారు.

విదేశీ సంఘటనలపై ర్యాలీలు ఎందుకు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, విద్యాసంస్థల యజమానులు , వివిధ సంఘాల నాయకులతో కలిసి విదేశీ సంఘటనలపై ర్యాలీ తీయటంపై బీజేపీ నాయకులు ఖండించారు. దీనిపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఒకప్రకటన విడుదల చేశారు. స్థానిక సమస్యలపై మాత్రం మౌనం వహిస్తున్నందుకు ప్రశ్నించారు. పాలస్తీనా గురించి మాట్లాడే నాయకులు జిల్లాలోను,రాష్ట్రంలోను జరుగుతున్న వైద్యదోపిడీపై, డ్రగ్స్‌మాఫియాకుట్రలపై, ఒక్కరైనా ప్రశ్నించారా అని అన్నారు. ఈ ర్యాలీలో విద్యార్థులను, ప్రైవేటు పాఠశాలల నుంచి తీసుకురావడం, తల్లిదండ్రుల అనుమతికి భిన్నంగా వారికి జెండాలు కట్టించి ర్యాలీలో నడిపించడం దుర్మార్గమన్నారు. గతంలో భారతదేశానికి వ్యతిరేకంగా ఉన్న పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చినప్పుడు వీరు ఎక్కడ దాగి ఉన్నారని, ర్యాలీలకు నాయకత్వం వహించిన పక్షాలు హమాస్ ఉగ్రదాడులనుఖండించలేకపోయారని ఆయన ప్రకటనలో గుర్తు చేశారు.

సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

కామేపల్లి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): ముచ్చర్ల క్రాస్‌రోడ్ నుంచి ఏన్కూర్ వరకు ఉన్న రహదారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు పాదయాత్ర చేపట్టారు. లాల్యతండ నుంచి కెప్టెన్‌బంజర వరకు శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ పాదయాత్రలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పాల్గొన్నారు. రహదారికి గుంతలు ఏర్పడి ఐదేళ్లు అవుతున్నా అధికారులు కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గంలో అనేక మంది తీవ్రగాయలు పాలైయ్యారని, మరికొందరు మృతి చెందారని చెప్పారు. ఈ పాదయాత్రలో బొంతు రాంబాబు, దుగ్గి క్రిష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, కృష్ణ, సుధాకర్, మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి, నరేందర్, వింజం నాగభూషణం, బాదావత్ శ్రీను, కిన్నెర రామచంద్రయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

కేఎంసీలో ఇద్దరి డిప్యూటేషన్ రద్దు

ఖమ్మంకార్పొరేషన్,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):ఖమ్మంనగర పాలక సంస్థలో ఇద్దరు ఉద్యోగుల డిప్యూటేషన్ రద్దు జరిగింది. సత్తుపల్లి, మధిర మునిసిపాలిటీల నుంచి ఖమ్మంనగర పాలక సంస్థలో డిప్యూటేషన్‌కు కేటాయించిన ఉద్యోగుల డిప్యూటేషన్‌ను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య రద్దు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

డెంగ్యూ లక్షణాలతో మహిళ మృతి

కొణిజర్ల,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ లక్షణాలతో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన కూచిపుడి హరిత(35) నాలుగురోజులుగా జ్వరంతో బాధపడుతుంది. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం నుంచి హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త నవీన్, ఒక కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై స్థానిక పెద్దగోపతి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రాధాకృష్ణ మాట్లాడుతూ డెంగ్యూ లక్షణాలతో పాటు ఊపిరితిత్తులు సంబంధిత వ్యాధితితో మృతి చెందిన్నట్లు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన



వరదయ్యనగర్‌లోని మైసమ్మతల్లికి పండ్లు, కూరగాయలతో అలంకరణ

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని జిల్లా వ్యాప్తంగా మహిళలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. జిల్లాలోని పలు ఆలయాలలో కుంకుమ పూజలు, వ్రతాలు, నోములు నిర్వహించారు. అమ్మవారికి స్వాగత సూచిగా ఇళ్ల ముందు ముగ్గులు, మామిడి తోరణాలు కట్టి వరలక్ష్మీ అమ్మవారికి స్వాగతం పలికారు. అమ్మవారికి పంచామృతభిషేకాలు, వివిధ రకాలు పిండి వంటలు, పండ్లును నైవేద్యంగా సమర్పించారు. ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి సుమంగళిగా ఉండే విధంగా ఆశీస్సులు తీసుకున్నారు. కొందరు ప్రత్యేకంగా అర్చకుల సమక్షంలో ఇంటటి వద్ద వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించుకోగా, మరి కొందరు ఆలయాలలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలలో పాల్గొన్నారు. నగరంలోని గుంటుమల్లేశ్వర స్వామి ఆలయం, రోటరీ నగర్ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కమాన్‌బజార్‌వెంకటేశ్వరస్వామి ఆలయం, అభయ వెంకటేశ్వర స్వామి ఆలయం, తోపాటు పలు ఆలయాలలో శుక్రవారం సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహించారు.స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ అమ్మవారికి, రెడ్డిపల్లి మారెమ్మ తల్లి ఆలయంలో, వరదయ్య నగర్ మైసమ్మ తల్లి ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేకఅలంకరణలు చేశారు. మైసమ్మ తల్లి ఆలయంలో వివిధ రకాలు కూరగాయలు, పండ్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి భోనాలు సమర్పించారు. ఈవో శ్రీకాంత్ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.



స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి అలంకరణ

బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): బీసీలకు పాలకులు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని మున్నూరుకాపు సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆయననివాసంలో మున్నూరు కాపుకులస్తుల మావేశం నిర్వహించారు. మున్నూరుకాపులు మిగతా బీసీ కులస్తులను కలుపుకొని 42 శాతం రిజర్వేషన్ సాధించేలా కృషిచేయాలన్నారు. మిగతా కులాల సహకారంతో ఖమ్మం కార్పొరేషన్ మేయర్ స్థానమే లక్ష్యంగా రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారు. దీనిపై కార్యాచరణ రూపొందించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కొత్తసీతారాములు, మూలగుండ్ల శ్రీహరి, ఉప్పు మోహన్‌రావు, చౌడవరపు వెంకటేశ్వర్లు, మెంతుల శ్రీశైలం, యర్రా అప్పారావు, కనకం జనార్థన్ పాల్గొన్నారు.



త్రివేణి, టైనీటాట్స్ పాఠశాలల్లో రాఖీ వేడుకలు

విద్యాలయాల్లో వేడుకలు

రాఖీ, వరలక్ష్మీ వ్రతం నిర్వహించిన యాజమాన్యాలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు, రాఖీవేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పండుగల విశిష్ఠతను తెలియజేశారు. విద్యార్థుల మధ్య పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని పాఠశాల యాజమాన్యం తెలిపింది.



సర్వజ్ఞలో వరలక్ష్మీ వ్రతాలు

మరో పర్యటనకు కేఎంసీ పాలకవర్గం

» 21నుంచి 23వరకు ఇండోర్‌లో పర్యటన
» ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
» వర్షాలు,వరదల సమయంలో పర్యటనపై పెదవివిరుపు



ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మరో స్టడి టూర్‌కు ఖమ్మం నగర పాలక సంస్థ పాలకవర్గం సిద్ధమవుతోంది. ఖమ్మం నగరం అభివృద్ధికి ప్రజాప్రతినిధులకు సరైన అవగాహన ఉండాలని, అభివృద్ధి చెందిన పట్టణాల్లో తీసుకుంటున్న చర్యలు, ఆధునిక విధానాలను స్వయంగా పాలకవర్గాలు తెలుసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా కేఎంసీ పాలకవర్గాలను ప్రోత్సహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల నిర్వాహణ, వ్యర్థాలు తిరిగివినియోగంపై గతంలోనే ఖమ్మం పాలకవర్గం ఇండోర్ పర్యాటనకు వెళ్లాల్సి ఉంది. కాగా ఆ సమయంలో ఇండోర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్, ఇతర నాణ్యతా ప్రమాణాల పరిశీలన జరగటంతో ఆపర్యాటనను పూణేకు మార్చులు చేశారు. మార్చి 5న ఖమ్మం నుంచి బయలు దేరి తిరిగి 9న మేయర్ బృందం ఖమ్మానికి చేరుకున్నారు. గతేడాది వార్షిక సమయం లోపుగా పూణే పర్యటన ముగిసింది. కాగా ఇటీవల జరిగిన కేఎంసీ కౌన్సిల్ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ ఇండోర్ పర్యటన గుర్తు చేశారు. దీంతో 2025 వార్షిక సంవత్సరంలో ఇండోర్ పర్యాటను ఖరారు చేశారు.బయోగ్యాస్ ప్లాంట్, చెత్త సేకరణ, నిర్వాహణ, పారిశుధ్య కార్మికుల పనిచేసే విధానాలను పరిశీలించనున్నారు. ఈనెల 21న మేయర్ పునుకొల్లు నీరజతో పాటుగా కార్పొరేటర్లు ఇండోర్‌కు బయలుదేరి 23రాత్రికి తిరిగి ప్రయాణం జరిగేలా ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు కార్యచరణ ప్రారంభించారు. కాగా మున్నేరు ఎగువ ప్రాంతంలోని వరంగల్, మహబూబాబాద్, హన్మకొండ, ఇల్లెందు, కామేపల్లి, సింగరేణి ప్రాంతాల్లోని చెరువులు ఇప్పటికే పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. ఎగువ ప్రాంతం లో రెండు గంటల పాటు వర్షం కురిసిన ఖమ్మంలో మున్నేరు 11అడుగులకు చేరుతోంది. గతేడాది ఆగస్టు చివరి వారంలోనే వర్షాలు పడి సెప్టెంబరు 1న మున్నేరు ప్రజలకు కన్నీరును మిగిల్చింది.ఆ సమయంలో కార్పొరేటర్లు, అధికారులు దగ్గరుండి మున్నేరు పరివాహక ప్రాంతంలోని బాధితులకు మూడు రోజుల్లో పారిశుధ్య పనులు పూర్తి చేశారు. తిరిగి సాధారణ పరిస్థితిలోకి రావటానికి నెల రోజులకు పైగా సమయం పట్టింది. వర్షాలు, వరదల సమయంలో కేఎంసీ పాలకవర్గం ఇండోర్ పర్యటనపై కొంత చర్చ జరుగుతుంది. మరో రెండు నెలల తర్వాత పర్యాటన ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

నానోయూరియాతో అధిక దిగుబడులు

తిరుమలాయపాలెం, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు నానో యూరియాతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ మిట్టపల్లి సతీష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సుబ్లేడులో నానో యూరియా, డీఏపీ వాడకంపై అవగాహన చేపట్టారు. ఈసందర్భంగా నానో యూరియా, డీఏపీ వాడకంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు.ఈకార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, ఏఈవో బాలకృష్ణ, పాల్గొన్నారు.

సుబ్లేడులో పారిశుధ్య కార్యక్రమాలు

తిరుమలాయపాలెం, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్లేడు గ్రామంలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని సైడ్‌కాలవలు, డ్రెయినేజీలోని మట్టిని తొలిగించి బ్లీచింగ్ చల్లారు. అలాగే తాగునీటి పథకాల వద్ద నీరు నిలవ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజ్‌కుమార్, ఆశావర్కర్లు లత, సత్యవతి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటికలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): నెలనెలావెన్నెల 8వవార్షికోత్సవం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా శుక్రవారం రెండోరోజు ఖరీదైన జైళ్లు, బ్రహ్మాస్వరూపం నాటికలు నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించారు. చైతన్య కళాభారతీ కరీంనగర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఖరీదైన జైళ్లు, మైత్రీ కళానిలయం విజయవాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రహ్మాస్వరూపం నాటికలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. రెండోరోజు నాటిక పోటీలను కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్, కార్పొరేటర్ కమర్తపు మురళీ హాజరై నాటక పోటీలను వీక్షించారు. నాటక పోటీలను చూసేందుకు ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరయ్యారని నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్ రావు, కొత్తూరు. దేవేంద్ర, చీఫ్ ప్యాట్రన్స్, నాగబత్తిని రవి, కురువెళ్ళ ప్రవీణ్, వీ.విజేత, వేముల సదానంద్ తెలిపారు. అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాద్ కళాసాంస్కృతికసంస్థ(ఆర్ఫ్) ఖమ్మం కళాపరిషత్, ప్రజానాట్యమండలి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో స్థానిక కళాకారులు, ఇతర కళాకారులచే ప్రాచీన కళలను, కథలను నిర్వహిస్తూ కళాకారులకు గుర్తింపువచ్చేలా ఈ నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం నిర్వహించే నాటక పోటీలకు ప్రముఖ సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో చెరుకూరి వనశ్రీ, కాటంనేని వీరభద్రారావు, రమేష్ పాల్గొన్నారు.



ఖరీదైన జైళ్లు నాటికలోని సన్నివేశం



నాటికలను వీక్షిస్తున్న తుమ్మల యుగంధర్

ధర్మస్థలి హత్యలపై న్యాయ విచారణ జరిపించాలి

వామపక్ష ప్రజాసంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న లతాదేవి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్రంలోని ధర్మస్థలిలో జరిగిన అమానవీయ హత్యాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో న్యాయ విచారణ జరిపించాలని వామపక్ష విద్యార్థి, మహిళ, ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా సీపీఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో పోటు కళావతి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. మతం పేరుతో అనేక సంవత్సరాలుగా ధర్మస్థలి ప్రాంతంలో మనుషులను బలి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలోమతం పేరుతో ప్రజల మధ్య విభజన తీసుకురావటం ప్రజాస్వామ్యం, లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలుగుతుందన్నారు. మతాన్ని అడ్డుపెట్టుకొని కొన్ని రాజకీయ శక్తులు బలపడేందుకు చూస్తున్నాయని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏపూరి లతాదేవి, సీతామహాలక్ష్మీ, బండి పమ్మ, మెరుగు రమణ, మాచర్ల లక్ష్మీ, గోకినేపల్లి లలిత, ఝాన్సీ, నానబాల రామకృష్ణ, మద్దోజు శ్రవణ్, ఇటికాల రామకృష్ణ, వెంకటేష్, యశ్వంత్, బషిరుద్దీన్, చింతల రమేశ్, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

కొలిక్కిరాని అల్లీపురం డొంక ఆక్రమణ పంచాయితీ

» కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు
» ఆక్రమణలు తొలగించి డొంక రోడ్డు నిర్మాణం
» తిరిగి ముగ్గులు పోసి హద్దులు మార్చిన ప్రజాప్రతినిధి

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం వేగంగా అభివృద్ధి చెందటంతో విలీన డివిజన్లలోని గ్రామీణ ప్రాంతాలపై నగరంలోని ప్రైవేట్ హాస్పటల్ నిర్వాహకుల కన్నుపడింది. డొంక దారికి సమీపంలోనే స్థలాన్ని కొనుగోలు చేశారు. ఏకంగా డొంకను ఆక్రమణ చేసి నిర్మాణాలు ప్రారంభించారు. అయితే స్థానికంగా ఉన్న రైతులు ఈవిషయాన్ని గమనించి కేఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. ప్రాథమికంగా విచారణ చేసిన పట్టణ ప్రణాళిక అధికారులు 66 అడుగుల డొంకకు రహదారి మార్కింగ్ చేయగా మరుసటి రోజు ఓ బీఆర్ఎస్ కార్పొరేటర్ తిరిగి ముగ్గులు పోసి డొంక దారిని మార్చారు. ఖమ్మం నగరంతో పాటుగా 15వ డివిజన్‌లోని అల్లీపురం వేగంగా అభివృద్ధి జరుగుతుంది. అల్లీపురానికి చుట్టూ ఇప్పటికే భారీరహదారులు నిర్మాణం జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఖమ్మంలోని ఓబడా తల్లీ పిల్లల హాస్పటల్ నిర్వాహకులు అల్లీపురంలో స్థలాన్ని కొనుగోలు చేశారు. డొంకను ఆక్రమణ చేసి ప్రహారి నిర్మాణం చేశారు. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతులు ఆక్రమణ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. గురువారం కేఎంసీ పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర ఆధ్వర్యంలో ప్రహారి నిర్మాణాలను తొలగించి, 66 అడుగుల డొంక రోడ్డుకు సరిహద్దులు ఏర్పాటు చేసి తత్కాలిక రహదారి నిర్మాణం చేశారు. కాగా స్థలం కొనుగోలు చేసిన ప్రైవేట్ హాస్పటల్ నిర్వాహకురాలు స్థలం అమ్మకం చేసిన వారిపై వత్తిడి పెంచారు. దీంతో శుక్రవారం సాయంత్రం ఓ ప్రజాప్రతినిధి వెళ్లి పట్టణ ప్రణాళిక అధికారులు వేసిన సరిహద్దులపై ముగ్గులు పోసి డొంక వెడల్పును తక్కువగా చేశారు. మళ్లీ స్థానికులు ఫిర్యాదులు చేయటంతో పట్టణ ప్రణాళిక అధికారులు మళ్లీ వెళ్లారు. రెండు వైపులా బలమైన వారు ఉండటంతో శనివారం మరోసారి పట్టణ ప్రణాళిక అధికారులు సర్వే చేపటనున్నారు. దీంతో అల్లీపురం డొంక ఆక్రమణ పంచాయతీ కొలిక్కిరాకుండా సాగుతోంది.



డొంక రోడ్డు వేసిన కేఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు, ముగ్గులు పోసిన ప్రజాప్రతినిధి



ఆంధ్రజ్యోతి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

8

ZONE

వైరా-మధిర సత్తుపల్లి

శనివారం 9 ఆగస్టు 2025

WYRA, MADHIRA, SATHUPALLY

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేయాలి

చింతకాని, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేయాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. భూస్వాములు, కాంగ్రెస్ నాయకులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారన్నారు. గ్రామ కమిటీలు ఇండ్ల మంజూరులో పక్షపాతం వహిస్తున్నాయన్నారు. అనర్హులను తొలగించి అర్హులకు ఇండ్లు కేటాయించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నాయకులు రాచబంటి రాము, వత్సవాయి జానకిరాములు, దేశబోయిన ఉపేందర్, గడ్డం కోటేశ్వరరావు, ఆలస్యం రవి పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ



కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న నాయకులు

వైరా, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపూడి గ్రామంలో శుక్రవారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు దోసపాటి కల్యాణ్‌రావు ఆధ్వర్యంలో గొల్లపూడిలోని 242, 243పోలింగ్ బూతుల పరిధిలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ దుర్గాప్రసాద్‌రెడ్డి, నాయకులు పుచ్చకాయల లింగరాజు, దుర్గాప్రసాద్, వీసం వెంకటేశ్వర్లు, కె.వెంకట్, నారాయణ పాల్గొన్నారు.

11న సొసైటీ కార్యాలయం ప్రారంభం

ముదిగొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలో నూతనంగా సొసైటీ కార్యాలయాన్ని ఈనెల 11వతేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభిస్తారని సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి తెలిపారు. శుక్రవారం డైరెక్టర్ల సమావేశాన్ని సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. వైస్‌చైర్మన్ బట్టు పురుషోత్తం, డైరెక్టర్లు రాయల శ్రీనివాసరావు, సింగు రాజయ్య, దేవరపల్లి అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన సేవలందేనా?

» వైద్యపరికరాల కొరతతో అరకొర సేవలు

» 100 పడకల భవనానికి నిధుల మంజూరు

వైరా, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఏడాది కిందట ఏరియా ఆస్పత్రి ప్రారంభమైనప్పటికీ ఇంతవరకు ఈ ప్రాంత ప్రజలకు సరైన వైద్యసేవలందడం లేదు. ఏడాది కాలంగా ఏరియా ఆస్పత్రి పేరుకు మాత్రమే పనిచేస్తోంది. వైరాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) భవనంలో ఏరియా ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది అరకొర సేవలందించి కాలం వెళ్లదీశారు. ఏరియా ఆసుపత్రి ఏర్పాటుకు అధికారులు అనేక ప్రైవేట్, ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. కానీ చివరకు ఇరుకైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే వైద్యసేవలు మొదలు పెట్టారు. ఏడాది నుంచి డాక్టర్లు, సిబ్బంది మొక్కుబడిగా వైరా వచ్చి కాలక్షేపం చేసి వెళ్లిపోయారనే విమర్శలున్నాయి. రూ.37కోట్లతో ఏరియా ఆసుపత్రికి సంబంధించిన వంద పడకల భవనాన్ని నిర్మిస్తున్నారు.

పోయిననెల 31నుంచి ఏరియా ఆసుపత్రిగా మారిన పీహెచ్‌సీ..

ఇదిలా ఉంటే దాదాపు ఐదారు దశాబ్దాల నుంచి ఉన్న వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రస్తుత భవనం నుంచి ఖాళీ చేశారు. ఈ భవనం మొత్తం ఏరియా ఆసుపత్రి ఆధీనంలోకి తీసుకున్నారు. ఏరియా ఆసుపత్రి ఏడాది నుంచి ఉన్నప్పటికీ ఈనెల మొదట్లో మాత్రమే ఆసుపత్రి బోర్డు ఏర్పాటు చేశారు. గతనెల 31వరకు కూడా ఏరియా ఆసుపత్రి ఉన్నట్లు ప్రజలకు ఎవరికి తెలియదు. పీహెచ్‌సీగానే అందరూ భావించారు. ఏరియా ఆసుపత్రి బోర్డు లేకపోవడమే అందుకు కారణం. 2023 అసెంబ్లీ ఎన్నికల కంటే కొన్ని నెలల ముందు వంద పడకలతో ఏరియా ఆస్పత్రిని ప్రభుత్వం మంజూరు చేసింది. డాక్టర్లు, సిబ్బంది సహా మొత్తం 90కిపైగా పోస్టులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.37కోట్లకుపైగా నిధులను కేటాయించింది. కొన్ని నెలలకే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఏరియా ఆస్పత్రి ఏర్పాటు ముందుకు సాగలేదు. ఎన్నికల అనంతరం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఏరియా ఆస్పత్రి వైద్యసేవల ప్రారంభంపై దృష్టిసారించారు. జాతీయ ప్రధాన రహదారి పక్కనే ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల వెనుక భాగంలో ఐదెకరాలకుపైగా స్థలంలో వందపడకల ఏరియా ఆస్పత్రికి గత ఏడాది ఆగస్టు 9న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. పక్కా భవనం నిర్మాణం పూర్తయ్యేవరకు వేచి చూడకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న కేవీసీఎం విద్యాసంస్థలకు చెందిన భవనాల్లో ఏరియా ఆస్పత్రి ఏర్పాటు గురించి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, వైద్య విధానపరిషత్ అధికారులు పరిశీలించారు. అయితే చివరికి పీహెచ్‌సీ భవనంలోనే ఏరియా ఆసుపత్రిని ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు ఈ ఆసుపత్రి ఆనవాలు ప్రజలకు తెలియదంటే నమ్మశక్యంగా లేదు.

పీహెచ్‌సీ వర్సెస్ ఏరియా ఆసుపత్రి...

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఏరియా ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది మధ్య కొన్నినెలల పాటు హోరాహోరీ పోరు సాగింది. ఈ రెండు ఆస్పత్రుల డాక్టర్లు, సిబ్బంది మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకున్నాయి. చివరికి పీహెచ్‌సీ వైద్యులపై ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పోలీసు కేసు పెట్టేవరకు పరిస్థితి వెళ్లింది. అయితే వైద్యఆరోగ్యశాఖలోని యూనియన్ల జోక్యంతో పోలీసు కేసుల ప్రమాదం తప్పిపోయింది. వైరాకు ఏరియా ఆస్పత్రి ఉన్నందున మండలంలోని గొల్లపూడి గ్రామంలో ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో కొంత కాలం కిందట ఆదేశాలు జారీ చేశారు. ఈ రెండు ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది మధ్య తీవ్రస్థాయిలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో గతనెల 31న వైరా పీహెచ్‌సీని మునిసిపాలిటీ పరిధిలోని సోమవరంలో ఉన్న పల్లె దవాఖానా భవనంలోకి తరలించి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో కళావతిబాయి దీన్ని ప్రారంభించారు. గొల్లపూడిలో పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించేంత వరకు సోమవరం పల్లెదవాఖానా భవనంలో పీహెచ్‌సీని నిర్వహిస్తారు. ఇదే సమయంలో అనేక దశాబ్దాల నుంచి వైరా పీహెచ్‌సీలో ఉన్న సామగ్రిని సిబ్బంది తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది అడ్డుకున్నారు. ఈ వ్యవహారం కాస్తా డీఎంహెచ్‌వో దృష్టికి వెళ్లింది. ఆమె జోక్యంతో కనీస అవసరాల కోసం కొంత సామగ్రిని తీసుకువెళ్లేందుకు ఏరియా ఆస్పత్రి వారు అంగీకరించడంతో కొంతవరకు వివాదం సమసిపోయింది. ఇప్పటికైనా ఏరియా ఆసుపత్రి వైద్యసేవలను ఈ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.



పీహెచ్‌సీ భవనంలో ఏర్పాటుచేసిన ఏరియా ఆస్పత్రి బోర్డు

నేషనల్ డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలి

మధిరరూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11వతేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో బి.వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సీడీపీవో బాలత్రిపుర సుందరిదేవి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దెందుకూరు, మాటూరుపేట పీహెచ్‌సీ వైద్యులు, విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 11న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1నుంచి 19సంవత్సరాల వయస్సులోపు పిల్లందరికి ఆల్బెండజోల్ ట్యాబ్‌లెట్లను దగ్గరుండి మింగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వై.ప్రభాకర్, డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్, వైద్య సిబ్బంది వి.వెంకటేశ్వర్లు, శరత్‌బాబు పాల్గొన్నారు.

కల్లూరు మున్సిపాలిటీలో డ్రైడే నిర్వహణ



కమిషనర్ పర్యవేక్షణలో గృహంలో నీటిని తొలిగిస్తున్న దృశ్యం

కల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం డ్రైడే సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ కమిషనర్ సంపత్‌కుమార్ పర్యవేక్షణలో ప్రతి వార్డులో ఈ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గృహాల పరిసరాల్లో, నీటి తొట్టిల్లో నిల్వ ఉన్న నీటిని తొలిగించారు. పరిసరాల పరిశుభ్రతపై క్షేత్రస్థాయిలో ఇంటింటా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, ఏఎన్ఎంలు, మునిసిపాలిటి సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి రూ.పదివేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న డాక్టర్ కాపా మురళీకృష్ణ

వైరా, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీటెక్ రెండో సంవత్సరం డేటా సైన్స్ చదువుతున్న ఏన్కూరుకు చెందిన నిరుపేద విద్యార్థి కారుమంచి వినయ్‌కు వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.పదివేల ఆర్థిక సహాయాన్ని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు లగడపాటి ప్రభాకర్, చింతోజు నాగేశ్వరరావు, ఉండ్రు శ్యాంబాబు, పెనుగొండ ఉపేంద్రరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, వై.బుచ్చిరామారావు, చెరుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ పోలింగ్



బాలజీ పాఠశాలలో మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని బాలజీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు నిర్వహించిన మాక్ పోలింగ్ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ప్రాముఖ్యత, ప్రజాప్రతినిధుల ఎంపిక తీరు, ప్రభుత్వ పాలన విధానంలో ప్రజలే కీలక పాత్ర అనే అంశాలపై విద్యార్థులకు సమగ్రమంగా అవగాహన కలిగేలా ఈ మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికలను తలపించేలా నామినేషన్ల పక్రియ, బ్యాలెట్ పత్రాల ద్వారా ఓటు హక్కును వినియోగం, ఎన్నికల విధుల్లో అధికారుల, ఏజెంట్ల పాత్రను విద్యార్థులు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ వలసాల బాలాజీ, హెచ్ఎం కే నరేంద్ర, ఉపాధ్యాయులు వలసాల శ్రీనివాసరావు, సిహెచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాకి నిరంతర సేవలు

సత్తుపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం సేవలు అందిస్తూ ప్రభుత్వ పరంగా రావాల్సిన బకాయిల కోసం దశలవారీగా ఉద్యమాలు నిర్వర్తిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వనమారెడ్డి చెంచురెడ్డి, సత్తుపల్లి యూనిట్ ప్రధాన కార్యదర్శి బద్రుద్దీన్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలోని కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులకు జిల్లా సంక్షేమశాఖ గుర్తింపు కార్డులను 175మందికి ఉచితంగా సంఘ పక్షాన అందజేశారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి బకాయిలను సకాలంలో చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఉద్యోగ జేఏసీకి ప్రభుత్వం హామీ ఇచ్చిన తేదీ ఈనెల 15వరకు వేచిచూసి ఆ తరువాత ఉద్యమ కార్యాచరణను నిర్ణయిస్తామన్నారు. నాయకులు ఏఎస్.ప్రకాశరావు, అద్దంకి వెంకటరత్నం, డీ.కృష్ణయ్య, సాంబశివారెడ్డి, వీ.వెంకటరత్నం, మల్లిఖార్జునరావు, కృష్ణయ్య, బూరుగు దాసు, మధుసూదనరాజు పాల్గొన్నారు.

తాటిపూడి-ముసలిమడుగు మధ్య రోడ్డు నిర్మించాలి

వైరా, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి-ముసలిమడుగు గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్త ముసలిమడుగు గ్రామ ప్రజలతో కలిసి ఈ రెండు గ్రామాల మధ్యనున్న మట్టి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. వైరా-మధిర ప్రధాన రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరం ఉన్న రహదారికి బీటీ సౌకర్యం లేకపోవడంతో ప్రజలతోపాటు కొత్తముసలిమడుగు గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అందువలన మూడుకిలోమీటర్ల మట్టి రోడ్డును బీటీతో నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సావిత్రి, మణి, నర్సమ్మ, రాజు, సురేష్ పాల్గొన్నారు.

డెంగ్యూ లక్షణాలతో మహిళ మృతి

కొణిజర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డెంగీ లక్షణాలతో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కూచిపుడి హరిత(35)గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త నవీన్, ఒక కుమారుడు ఉన్నారు. తల్లి చనిపోవడంతో కుమారుడు తల్లి మృతదేహంపై ఏడుస్తున్న తీరు అందరిని కంటతడ పెట్టించింది. ఈ విషయంపై స్థానిక పెద్దగోపతి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రాధాకృష్ణ మాట్లాడుతూ.. డెంగీ లక్షణాలతో పాటు ఊపిరితిత్తులు సంబంధిత వ్యాధితో మృతి చెందిన్నట్లు తెలిపారు.

ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి

వైరా, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్య సమితి పిలుపులో భాగంగా ఈనెల 9న గిరిజన తెగలు తమ హక్కుల కోసం ప్రపంచ గిరిజన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో ఈనెల 9నుంచి 13వరకు జరుగనున్న ఈ వేడుకల్లో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనలు చేపట్టాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా గిరిజన జాతి ఉనికి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ హక్కుల సాధన కోసం గిరిజన హక్కుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి

» మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్

మధిర, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీన మధిర మండలం వంగవీడులో నలుగురు మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ కోరారు. శుక్రవారం డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మధిర, ఎర్రుపాలెం మండలాల రైతుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు మధిర మండలం వంగవీడు వద్ద 600 కోట్లతో నిర్మించే జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకటి శ్రీహరి, ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హజరు కానున్నారని తెలిపారు. ఈనెల 10వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు శంకుస్థాపన అనంతరం జరిగే బహిరంగ సభకు అధిక సంఖ్యలో రైతులు, ప్రజలు హజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నరసింహరావు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బొగ్గు లోడింగ్‌లో వేగాన్ని పెంచాలి

» సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) వెంకన్న

సత్తుపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఓసీలలో సేకరించిన నాణ్యమైన బొగ్గు లోడింగ్ వేగాన్ని పెంచాలని సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) బీ.వెంకన్న సూచించారు. శుక్రవారం ఆయన జేవీఆర్ ఓసీ-2, సీహెచ్‌పీ, కిష్టారం ఓసీలను ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఉత్పత్తితోపాటు కిష్టారం ఓసీ కోల్ బెంచ్ షావెల్ వద్ద బొగ్గు నాణ్యతను పరిశీలించారు. జేవీఆర్ ఓసీలో అధికారులతో మైన్ యొక్క ఉత్పత్తి, ఉత్పాదకతపై చర్చించిన తర్వాత జేవీఆర్ సీహెచ్‌పీ, రైల్వే అధికారులతో బొగ్గు రవాణా, నిర్వహణలో ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. రైల్వే సిగ్నల్ వ్యవస్థ, సైలో రాపిడ్ లోడింగ్ వ్యవస్థలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు, పీవోలు ఎంవీ.నరసింహారావు, ప్రహ్లాద్, ఎస్ఎం రామకృష్ణ, ఏఈ సూర్యనారాయణరాజు, అధికారులు ఏ.సోమశేఖరరావు, మదన్‌మోహన్‌రావు, వీ.తౌర్య, రవికుమార్, ఏ.రాజేంద్రబాబు, కేవై.పాషా, పాల్గొన్నారు.

పైలాన్ పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

మధిర రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మధిర, ఎర్రుపాలెం మండలాలను ఎన్నెస్పీ సెకండ్ జోన్‌గా మార్చేందుకు రూ.630.30కోట్లతో నిర్మించతలపెట్టిన జవహర్ లిఫ్టు శంకుస్థాపన పైలాన్ నిర్మాణ పనులను శుక్రవారం ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, ఆత్మకమిటీ చైర్మన్ కర్నాటి కోటేశ్వరరావు మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈనెల పదోతేదీన మధిర మండలం వంగవీడు గ్రామం వద్ద వైరా నదిపై నిర్మించతలపెట్టిన జవహర్ ఎత్తిపోతల పథకం శంకుస్థాపన కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల కార్యవర్గం ఎన్నిక

ముదిగొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక శుక్రవారం ముదిగొండలోని మచ్చా వీరయ్యభవనంలో నిర్వహించారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. సామాల కోటేశ్వరరావు ప్యానెల్ విజయం సాధించారు. మండల అధ్యక్షుడిగా కోటేశ్వరరావు, కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా చందును ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వెంకట్, కోశాధికారి తిరుపతిరావు, అసోసియేషన్ నాయకులు రఘు, రాంబాబు, దామోదర్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా జూపాటి

ఏన్కూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షుడుగా జూపాటి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు శుక్రవారం ఏన్కూరులో ఆసంఘం జిల్లాబాధ్యులు నంద్యాల నరసింహారావు , రావులపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా జూపాటి శ్రీనివసరావు, పట్టణ అధ్యక్షుడుగా నరసింహారావును ఎన్నుకున్నట్టు తెలిపారు

పింఛను పెంపు హామీలను నెరవేర్చాలి

» సెప్టెంబరు 3న చలో హైదరాబాద్

» ప్రతిపక్ష పాత్ర పోషించకుండా ఫామ్ హౌస్‌లో నిద్రపోతున్న కేసీఆర్

» ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

మధిర రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో దివ్యాంగులకు, వృద్ధులకు పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదని, ఇచ్చిన మాటను నెరవేర్చుకొని హామీని అమలు చేయాలని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి మధిర మార్కెట్‌యార్డు ప్రాంగణంలో జరిగిన మధిర డివిజన్ దివ్యాంగుల మహాగర్జన సన్నాహక సదస్సులో కృష్ణమాదిగ పాల్గొని ప్రసంగించారు. పింఛన్ల పెంపు కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఈనెల 13న నిర్ణయించామని అయితే సెప్టెంబరు మూడోతేదీకి గర్జన సదస్సును మార్చడం జరిగిందన్నారు. వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, తీవ్ర వైకల్యం కలిగిన వారికి రూ.15వేలు పింఛన్లు పెంచాలని కోరుతూ హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన సదస్సుకు మధిర ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సరంన్నర దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో నిద్రపోతున్నారని విమర్శించారు. దివ్యాంగుల పక్షాన తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అందాల పోటీలకు కోట్లు ఖర్చుపెట్టిన ప్రభుత్వం అంగవైకల్యం కలిగిన వారి పట్ల ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. జిల్లా నాయకుడు నాగరాజు, స్థానిక ఎంఆర్పీఎస్ నాయకులు ప్రభాకర్, సునీల్, మేకల రాజా పాల్గొన్నారు.

విజయవంతగా ముగిసిన ఆర్‌జేవై జిల్లాస్థాయి క్రీడలు

» విజేతలకు బహుమతుల ప్రదానం

కల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో గత మంగళవారం (నాలుగు రోజుల పాటుగా) ప్రారంభమైన రాజీవ్ గాంధీ మెమోరియల్ స్మారక అండర్ -16 ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు శుక్రావారంతో విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలైన క్రీడాకారులకు కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి ట్రోఫీలు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో హార్వెస్ట్ స్కూల్ ఖమ్మం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కల్లూరు జట్ల మధ్య హోరాహోరిగా పోటీలో తలపడ్డాయి. ఈ పోటీలో విన్నర్ ఆఫ్ ట్రోఫీగా హార్వెస్ట్ స్కూల్ ఖమ్మం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కల్లూరు కైవసం చేసుకున్నాయి. విజేతలకు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమలో రాజీవ్ గాంధీ స్మారక క్రికెట్ పోటీల నిర్వహణ కార్యక్రమాన్ని సీనియర్ క్రికెటర్ మతిన్, నాగేశ్వరరావులతో పాటుగా పిడిలు బి భీమా, వీరరాఘవయ్య, తల్లపరెడ్డి గౌతమ్‌నెడ్డి, శ్రీనివాస్, గోపి, కాంగ్రెస్ నాయకులు లక్కినేని కృష్ణ బాగం ప్రభాకర చౌదరి, ఎస్‌కే ఉస్మాన్, ఆళ్లకుంట నరిసింహారావు, దేవాలయ చైర్మన్ దారా రంగా తదితరులు పాల్గొన్నారు.



విజేతలైన క్రీడాకారులకు ట్రోఫీని అందిస్తున్న ఏఎంసి చైర్మన్ నీరజదేవి

పద్మావతి అమ్మవారికి శ్రావణ పూజలేవీ?



కొలువైన పద్మావతి అమ్మవారు

ఎర్రుపాలెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి అలివేలు మంగ, పద్మావతి రెండు ప్రధాన ఉపాలయాలున్నాయి. ఆషాడ మాసంలో భక్తులు లేక వెలవెలబోయిన ఆలయాలు, శ్రావణ మాసం ఆరంభం నుంచి భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. ఈనెల 3నుంచి 5వరకు శ్రావణ మాసం సందర్భంగా వార్షిక పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అయితే ప్రతిఏటా శ్రావణ మాసంలో వచ్చే శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహిస్తారు. ఆ రోజు అమ్మవార్లక ప్రత్యేక అలంకారం, పూజలు చేస్తారు. పద్మావతి ఆలయంలో మహిళలందరితో వరలక్ష్మి వ్రతం, సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తారు. కానీ శుక్రవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించకపోవడంతో మహిళలు నిరాశచెందారు. దీంతో శ్రావణ శుక్రావరం పద్మావతి ఆలయం భక్తులు లేక శ్రావణ శోభను కోల్పోయింది. ఆలయ అధికారులు మొద్దునిద్రను వీడి భక్తులు మనోభావాలు పరిగణలోకి తీసుకోవాలని, ప్రత్యేక తిథుల్లో ఆలయాల్లో శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నారు. గతంలో శ్రావణ శుక్రవారాల్లో పూజల కోసం టికెట్లను ఏర్పాటు చేసి పూజలు, అర్చనలు భక్తులు అందుబాటులో ఉండేవని ప్రస్తుతం ఆ వాతావరణం కనిపించడంలేదని ఆవేదన చెందుతున్నారు.

విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

» విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట

ముదిగొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలో శుక్రవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఈ రామకృష్ణారావు పాల్గొని రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏఈలు శ్రీనివాస్, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

తల్లాడ, " తడి బట్టలను ఆరబెట్టేందుకు విద్యుత్ వైరింగ్ తీగలు వాడకం ప్రమాదకరమని విద్యుత్‌శాఖ ఏఈ ఆర్.ప్రసాద్ అన్నారు. శుక్రవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో తల్లాడలో విద్యుత్‌శాఖ సిబ్బంది నివాసగృహాలు సందర్శించి విద్యుత్‌వైరింగ్, ఇనుప తీగ దండేల వల్ల జరుగుతున్న ప్రమాదాలు గురించి అవగాహన కలిగించారు.

సత్తుపల్లిరూరల్, " ఉతికన బట్టలు, ఇతరత్రా అవసరాల నిమిత్తం కరెంట్, ఐరన్ తీగలు వాడొద్దని, ఇవి అత్యంత ప్రమాదకరమని సత్తుపల్లి ఏడీఈ ప్రసాదబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కాకర్లపల్లిలో విద్యుత్ వినియోగంపై ఆయన స్థానికులకు అవగాహన కల్పించారు. లైన్ ఇన్స్‌పెక్టర్ రామారావు, జూనియర్ లైన్‌మెన్ చంద్రశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కల్లూరు, " విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కల్లూరు విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ పి వెంకట్ శుక్రవారం ప్రజలకు సూచించారు. విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ బత్తుల సత్యనారాయణ, లైన్‌మెన్ శ్రీనివాస్, జేఎల్ఎంలు జాన్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఈడీ

ఘనంగా వరలక్ష్మీ పూజలు

శ్రావణమాస వరలక్ష్మీ వ్రత పూజలను మహిళలు సంప్రదాయ రీతిలో జరుపుకున్నారు. వేకువజాము నుంచే ఇళ్లలో లక్ష్మీదేవి ఫొటోలను అలంకరించి పలురకాల పూజా సామగ్రితో పూజలు చేశారు. ప్రతి ఆలయంతో పాటు ఇళ్లలో శ్రావణమాస వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. ముత్తైదువులు వరలక్ష్మీ వ్రతపూజతోపాటు కుంకుమ పూజ నిర్వహించారు.



కల్లూరు సాముహిక పూజల్లో..



పెనుబల్లిలో..



తల్లాడలో వ్రతంలో పాల్గొన్న మహిళలు



వైరాలో పూజలు చేస్తున్న మహిళలు



కారేపల్లిలో..